News Daily
ఎడిటర్ : B. ఉపేందర్
cknews7484@gmail.com
Visit in : www.cknewstv.in

# CK NEWS చంద్రకాంత్
తెలుగు దినపత్రిక

Website cknewstv.in

సంపుటి : 02 | సంచిక :339 | ఖమ్మం | బుధవారం జనవరి 22, 2025 | CK NEWS | పేజీలు : 08

Hyderabad, Karimnagar, Khammam, Nalgonda, Nizamabad, Warangal, Mahabubnagar. Rangareddy, Medak, Adilabad

## రియల్టర్‌పై ఈటల దాడి

**ఎంపీతో పాటు అటాక్ చేసిన ప్లాట్ ఓనర్స్**

ఇద్దరికి గాయాలు.. ఆస్పత్రికి తరలింపు

ఘట్కేసర్ మండలం కొర్రెములలో ఘటన

పోలీసులకు ఫిర్యాదు చేస్తానన్న బాధితుడు



పేదల భూములను ఆక్రమించుకున్నాడని ఆరోపిస్తూ... బీజేపీ నేత, మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ ఈరోజు ఓ రియల్ ఎస్టేట్ బ్రోకర్ ను కొట్టారు. ఈ ఘటన మేడ్చల్ జిల్లా పోచారం మున్సిపా లిటీ పరిధిలో చోటు చేసుకుంది. రియల్ ఎస్టేట్ బ్రోకర్ వైపు కోపంగా దూసుకొచ్చిన ఈటల అతని చెంపపై ఒక్కటి కొట్టారు. ఆ తర్వాత అక్కడే ఉన్న బీజేపీ కార్యకర్తలు కూడా కొంతమంది ఆ బ్రోకర్ పై చేయి చేసుకున్నారు. పోచారం మున్సిపాలిటీ పరిధిలోని ఏకశిలా నగర్‌లో ఈటల పర్యటించారు. రియల్ ఎస్టేట్ ఏజెంట్లు తనపై దౌర్జన్యానికి పాల్పడుతున్నారంటూ ఓ మహిళ ఫిర్యాదు చేసింది.

వివరాలు 2లో..



## మేఘా భారీ పెట్టుబడులు

- రూ.15 వేల కోట్లతో వివిధ ప్రాజెక్టులు నెలకొల్పేందుకు దావోస్ వేదికగా అంగీకారం
- రూ.500 కోట్లతో రాకెట్ తయారీ పరిశ్రమ ఏర్పాటుకు స్కైరూట్ ఒప్పందం
- పామాయిల్ ఫ్యాక్టరీ, బాటిల్ క్యాప్ యూనిట్ ఏర్పాటుకు ముందుకొచ్చిన యునిలీవర్
- దావోస్‌లో పలువురు పారిశ్రామికవేత్తలతో సీఎం రేవంత్‌రెడ్డి బృందం భేటీ

ప్రపంచ ఆర్థిక వేదిక సదస్సు సందర్భంగా తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు పలు కంపెనీలు ఆసక్తి కనబరుస్తున్నాయి. ఈ మేరకు సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని బృందంతో ప్రముఖ సంస్థలు చర్చలు జరిపి ఒప్పందాలు చేసుకుంటున్నాయి. రూ.15 వేల కోట్లతో ఆధునిక పంప్డ్ స్టోరేజీ విద్యుత్ ప్రాజెక్టు, బ్యాటరీ శక్తి నిల్వ వ్యవస్థ, అనంతగిరి కొండల్లో ప్రపంచస్థాయి వెల్‌నెస్ రిసార్ట్ ఏర్పాటుకు తెలంగాణ ప్రభుత్వంతో మేఘా ఇంజినీరింగ్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ లిమిటెడ్(ఎంఈఐఎల్) అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. రూ.500 కోట్లతో రాష్ట్రంలో ప్రైవేట్ రాకెట్ తయారీ, ఇంటిగ్రేషన్.. టెస్టింగ్ యూనిట్ ఏర్పాటుకు 'స్కైరూట్' కంపెనీ ముందుకొచ్చింది. తెలంగాణలో రెండు తయారీ యూనిట్లను ఏర్పాటు చేసేందుకు 'యునిలీవర్' కంపెనీ సంసిద్ధత వ్యక్తంచేసింది. దావోస్‌లో జరుగుతున్న ప్రపంచ ఆర్థిక వేదిక వార్షిక సదస్సులో రెండోరోజు మంగళవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని తెలంగాణ రైజింగ్ ప్రతినిధి బృందం పలువురు పారిశ్రామికవేత్తలతో సమావేశమైంది. తెలంగాణ పెవిలియన్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి శ్రీధర్‌బాబు, ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్, సీఎంవో ప్రధాన కార్యదర్శి వి.శేషాద్రి, సీఎం ప్రత్యేక కార్యదర్శి అజిత్‌రెడ్డి, పెట్టుబడుల ప్రచార శాఖ ప్రత్యేక కార్యదర్శి విష్ణువర్ధన్‌రెడ్డి తదితరులు.. మేఘా, యునిలీవర్, స్కైరూట్ సంస్థల ప్రతినిధులతో చర్చలు జరిపారు.

వివరాలు 2లో..

## జనసేనకు ఈసీ గుడ్ న్యూస్.. గాజు గ్లాసు గుర్తు రిజర్వ్..




జనసేనకు గుడ్ న్యూస్ చెప్పింది ఎన్నికల సంఘం.. జనసేన అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్,ఆ పార్టీ కార్యకర్తలు ఎన్నాళ్ళుగానో ఎదురు చూస్తున్న గుర్తింపు రానే వచ్చేసింది. దీంతో పాటు జనసేనకు గాజు గ్లాసు గుర్తును రిజర్వ్ చేసింది ఈసీ. జనసేన పార్టీని ఏపీలో గుర్తింపు పొందిన పార్టీల లిస్ట్ లో చేర్చింది ఈసీ... జనసేనను గుర్తింపు

వివరాలు 2లో..

## హైదరాబాద్‌లో ఐటీ సోదాల కలకలం

- టీజీఎఫ్‌డీసీ ఛైర్మన్ దిల్ రాజు సంస్థల్లో..
- మైత్రీ మూవీ మేకర్స్ నిర్మాతల ఇళ్లల్లోనూ తనిఖీలు



హైదరాబాద్‌లో ఆదాయపన్ను(ఐటీ) శాఖ సోదాలు మంగళవారం కలకలం రేపాయి. తెలంగాణ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (టీజీఎఫ్‌డీసీ) ఛైర్మన్, వెంకటేశ్వర క్రియేషన్స్

వివరాలు 2లో..

## భారీ ఎన్‌కౌంటర్
## 20 మంది మావోయిస్టులు మృతి

ఒక జవాన్‌కు గాయాలు

వివరాలు 2లో..


చత్తీస్‌గఢ్–ఒడిశా సరిహద్దులో ఘటన

ఇరు రాష్ట్రాల పోలీసుల జాయింట్ ఆపరేషన్

మృతుల్లో ఒడిశా రాష్ట్ర కార్యదర్శి చలపతి







## నక్సలిజం చివరి దశకు చేరింది

వివరాలు 2లో..

భద్రతా బలగాల గొప్ప విజయం.. కేంద్ర హోంమంత్రి అమిత్ షా

## పాత ఒప్పందం ప్రకారమే నీటి పంపకాలు

- కృష్ణా బోర్డు అంగీకారం
- 50:50 నీటి వాటాలపై తెలంగాణ పట్టు, కుదరదన్న ఏపీ
- అంతర్గత టెలిమెట్రీకి అంగీకరించబోమని స్పష్టీకరణ
- కమిటీ ఏర్పాటుకు బోర్డు ప్రతిపాదన... ప్రభుత్వ ఆమోదం కావాలన్న ఆంధ్రప్రదేశ్
- ప్రధాన కార్యాలయం విజయవాడ తరలింపునకు బోర్డు సై



ఆంధ్రప్రదేశ్, తెలంగాణల మధ్య పాత ఒప్పందానికి అనుగుణం గానే వచ్చే నీటి సంవత్సరంలోనూ నీటి పంపకాలు చేయాలని కృష్ణా బోర్డు నిర్ణయించింది. ఆంధ్రప్రదేశ్‌లో అంతర్గత నీటి వాడకం లెక్కలూ తెలిసేలా నీటిమీటర్లు (టెలిమీటర్లు) ఏర్పాటు చేయాలన్న తెలంగాణ ప్రతిపాదనను ఏపీ వ్యతిరేకించింది. కమిటీ ఏర్పాటు చేద్దామన్న బోర్డు నిర్ణయానికీ

వివరాలు 2లో..

## ఈ సంక్రాంతి సీజన్ లో ఏపీఎస్ఆర్టీసీకి భారీగా ఆదాయం



- సంక్రాంతి డిమాండ్ దృష్ట్యా 9,097 ప్రత్యేక సర్వీసులు నడిపిన ఆర్టీసీ
- ఈ నెల 20వ తేదీ ఒక్క రోజునే రూ.23.71 కోట్ల ఆదాయం
- వరుసగా మూడు రోజుల పాటు రూ.20 కోట్లకు పైగా రాబడి

వివరాలు 2లో..

## మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్ రెడ్డిపై దాడి



- నల్గొండ మున్సిపల్ కార్యాలయంలో కేటీఆర్ ఫ్లెక్సీల తొలగింత
- ఫ్లెక్సీల తొలగింపుపై బీఆర్ఎస్ శ్రేణుల ఆందోళన
- కోమటిరెడ్డి అనుచరులు దాడి చేశారన్న భూపాల్ రెడ్డి

బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్ రెడ్డిపై దాడి జరిగింది. నల్గొండ మున్సిపల్ కార్యాలయంలో ఈ దాడి జరిగింది. మున్సిపల్ కార్యాలయంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఫ్లెక్సీలను తొలగించారు.

వివరాలు 2లో..

## డిప్యూటీ సీఎం అంశంపై ఎవరూ బహిరంగంగా మాట్లాడవద్దు

**జనసేన కేంద్ర కార్యాలయం**

- కూటమిలో కలకలం రేపుతున్న డిప్యూటీ సీఎం అంశం
- దీనిపై మాట్లాడొద్దని ఇప్పటికే ఆదేశాలు జారీ చేసిన టీడీపీ హైకమాండ్
- సోషల్ మీడియాలో కూడా స్పందించవద్దని జనసైనికులకు జనసేన ఆదేశం

వివరాలు 2లో..



## ఏపీలో డీఆర్‌వో నిర్వాకం: రివ్యూ మీటింగ్ లో ఆన్‌లైన్ రమ్మీ గేమ్ ఆడుతూ బిజీ



చేస్తుందేమో బాధ్యత గల రెవెన్యూ అధికారి ఉద్యోగం పైగా కలెక్టరేట్ లో రివ్యూ మీటింగ్.. ఎంతో బాధ్యతగా ఉండాల్సింది పోయి ఏపీలో ఓ డీఆర్వో రివ్యూ మీటింగ్ లో ఆన్ లైన్ రమ్మీ గేమ్ ఆడుతూ కనిపించాడు. మంగళవారం ( జనవరి 21, 2025 ) అనంతపురంలో జరిగిన

వివరాలు 2లో..

# మేఘా భారీ పెట్టుబడులు

**మేఘా పరిశ్రమలతో 7,000 ఉద్యోగాల కల్పనకు అవకాశం**

ఆధునిక పంప్డ్ స్టోరేజీ విద్యుత్తు ఉత్పత్తి ప్రాజెక్టును ఏర్పాటు చేసేందుకు తెలంగాణ ప్రభుత్వంతో మేఘా ఇంజినీరింగ్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ లిమిటెడ్(ఎంఈఐఎల్) అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. పునరుత్పాదక ఇంధనం, సుస్థిర అభివృద్ధికి తెలంగాణ సర్కారు నిబద్ధతను బలపరుస్తూ దావోస్‌లో జరుగుతున్న ప్రపంచ ఆర్థిక వేదిక సదస్సులో ఈ ఒప్పందంపై సంతకం చేసింది. ఈ మేరకు తెలంగాణ పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు, మేఘా సంస్థ అధినేత కృష్ణారెడ్డి ఒప్పందంపై సంతకాలు చేశారు. ఈ పెట్టుబడుల్లో భాగంగా ఎంఈఐఎల్ తెలంగాణాలో 2,160 మెగావాట్ల పంప్డ్ స్టోరేజీ విద్యుత్తు ప్రాజెక్టును రూ.11 వేల కోట్ల ప్రతిపాదిత పెట్టుబడితో ఏర్పాటు చేయనుంది. నిర్మాణ దశలో సుమారు 1,000 ఉద్యోగాలు, కార్యకలాపాల దశలో అదనంగా మరో 250 ఉద్యోగాలను సృష్టించవచ్చని భావిస్తున్నారు. ఈమేరకు కంపెనీ తెలంగాణాలో రిక్రూట్‌మెంట్ డ్రైవ్‌లను ప్రారంభించనుంది. బ్యాటరీ శక్తి నిల్వ వ్యవస్థ(బెస్) ప్రాజెక్టుపై తెలంగాణ ప్రభుత్వం, ఎంఈఐఎల్ మధ్య ఒప్పందం కుదిరింది. ఇందులో భాగంగా తెలంగాణవ్యాప్తంగా పలు వ్యూహాత్మక కేంద్రాల్లో రూ.3 వేల కోట్ల విలువైన 1,000 మెగావాట్ల అత్యాధునిక బ్యాటరీ శక్తి నిల్వ వ్యవస్థను ఏర్పాటు చేయనున్నారు. ఈ ప్రాజెక్టు ద్వారా రెండేళ్లలో 1,000 ప్రత్యక్ష ఉద్యోగాలు.. 3,000 పరోక్ష ఉద్యోగాలు సృష్టించే అవకాశముంది. సమర్థమైన ఇంధన నిల్వ, గ్రిడ్ స్థిరత్వం, పీక్‌లోడ్ మేనేజ్‌మెంట్‌ను ప్రారంభించడం ద్వారా తెలంగాణ పునరుత్పాదక ఇంధన మౌలిక సదుపాయాలను బలోపేతం చేయడంలో ఈ ప్రాజెక్టు కీలకం కానుంది. అనంతగిరి కొండల్లో ప్రపంచస్థాయి వెల్‌నెస్ రిసార్ట్‌ను నెలకొల్పేందుకు మరో ఒప్పందం కుదిరింది. ఇందుకోసం ఎంఈఐఎల్ రూ.1,000 కోట్ల పెట్టుబడిని పెట్టనుంది. లగ్జరీ టూరిజం, ప్రాంతీయ ఆర్థికవృద్ధిని ప్రోత్సహించేందుకు ఈ ప్రాజెక్టు దోహదం చేయనుంది. ఈ ప్రాజెక్టు నిర్మాణం, కార్యకలాపాల దశలో 2 వేల ఉద్యోగాలను సృష్టించే అవకాశముంది. ఈ మేరకు స్థానికులకే ఉద్యోగావకాశాలు కల్పిస్తుంది.

**సీఎం రేవంత్‌రెడ్డితో స్కైరూట్ సంస్థ ప్రతినిధులు యునిలీవర్‌తో రెండు ఒప్పందాలు..**

వినియోగ వస్తువుల తయారీలో ప్రపంచంలో పేరొందిన యునిలీవర్.. మన దేశంలో 'హిందూస్తాన్ లీవర్' పేరిట వ్యాపార వ్యవహారాలు నిర్వహిస్తోంది. చర్చల సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి తెలంగాణలో ఉన్న వ్యాపార అవకాశాలను సంస్థ ప్రతినిధులకు వివరించారు. "దక్షిణభారత దేశంలో అన్ని రాష్ట్రాలకు తెలంగాణ వారధిగా ఉంటుంది. పెట్టుబడులకు, పరిశ్రమల ఏర్పాటుకు రాష్ట్రంలో అనుకూల వాతావరణం ఉంది. తెలంగాణలో వినియోగ వస్తువులకు భారీ మార్కెట్ ఉంది. సులభతర వ్యాపార విధానాలు అదనపు బలాన్నిస్తాయి. తెలంగాణ రైజింగ్ 2050 విజన్‌తో రాష్ట్ర ప్రభుత్వం ఎంచుకున్న భవిష్యత్తు ప్రణాళిక ప్రపంచవ్యాప్తంగా అందరినీ ఆకర్షిస్తోంది" అని సీఎం పేర్కొన్నారు. దేశంలో యునిలీవర్ తయారీ కేంద్రాలున్నప్పటికీ.. ఈ కంపెనీ తెలంగాణలో విస్తరించలేదు. దేశంలో అత్యధికంగా విస్తరణ అవకాశాలున్న వాటిపై దృష్టి సారించి, అటువంటి రంగాల్లోనే పెట్టుబడులు పెట్టాలని ముఖ్యమంత్రి.. కంపెనీ ప్రతినిధులతో తన అభిప్రాయాలను పంచుకున్నారు. దీనిపై స్పందించిన యునిలీవర్ సీఈవో సీఈఓ హీన్ షూమాకర్.. తెలంగాణలో పామాయిల్ ఫ్యాక్టరీ, రిఫైనింగ్ యూనిట్‌ను ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. కామారెడ్డి జిల్లాలో స్థలాన్ని కేటాయిస్తామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు. యూనిలీవర్ బృందం బాటిల్ క్యాప్‌ల ఉత్పత్తి కోసం కొత్త తయారీ యూనిట్‌ను తెలంగాణలో ఏర్పాటు చేయడానికి అంగీకరించింది. ఈ సంస్థ ఉత్పత్తులు ఎక్కువగా ద్రవరూపంలో సీసాల్లో అమ్ముడవుతున్నాయి. ప్రస్తుతం ఈ బాటిల్ క్యాప్‌లను ఇతర ప్రాంతాల నుంచి దిగుమతి చేసుకుంటున్నారు. రాష్ట్రంలో ఏర్పాటు చేసే యూనిట్ వీటి కొరతను తీర్చనుంది.

**అజిలిటీ ఛైర్మన్‌తో..**

దావోస్‌లో తెలంగాణ పెవిలియన్‌లో జరిగిన మొదటి సమావేశంలో రాష్ట్ర ఐటీ, పరిశ్రమల మంత్రి శ్రీధర్‌బాబు అజిలిటీ సంస్థ ఛైర్మన్ తారెక్ సుల్తాన్‌తో భేటీ అయ్యారు. అజిలిటీ.. ప్రపంచంలో పేరొందిన లాజిస్టిక్స్ కంపెనీల్లో ఒకటి. తెలంగాణ ప్రభుత్వం వ్యవసాయ రంగ అభివృద్ధిపై ప్రత్యేకంగా దృష్టి సారించడంతోపాటు.. రైతుల ఆదాయాన్ని స్థిరంగా పెంచేందుకు ఇస్తున్న ప్రాధాన్యాలను మంత్రి శ్రీధర్‌బాబు ఆ సంస్థ ఛైర్మన్‌తో పంచుకున్నారు.

**సాంబనోవా కంపెనీ...**

మంత్రి శ్రీధర్‌బాబు, అధికారులు మంగళవారం సాంబనోవా కంపెనీ చీఫ్ గ్రోత్ ఆఫీసర్ 'సూ లే'తో చర్చలు జరిపారు. ప్రధానంగా తెలంగాణలో సెమీ కండక్టర్ పరిశ్రమలకు సంబంధించిన పెట్టుబడుల అవకాశాలపై చర్చించారు. కాలిఫోర్నియాకు చెందిన సాంబనోవా.. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కంపెనీ. ఏఐ హార్డ్ వేర్, సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్ అందించటంలో పేరొందింది. ఈ సంస్థతో జరిగిన చర్చలు సానుకూలంగా ముగిశాయి.

**సౌదీ అరేబియా ఫెడరల్ మంత్రితో..**

మంత్రి శ్రీధర్‌బాబు మంగళవారం సౌదీ అరేబియా ఫెడరల్ మినిస్టర్ ఖలీద్ మహమ్మద్ అల్ సలీమ్‌తో భేటీ అయ్యారు. రాష్ట్రంలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలను మంత్రి వివరించారు.

**ఎంటీసీ సంస్థతో..**

తెలంగాణలో పెట్టుబడులపై మంత్రి శ్రీధర్‌బాబు మిత్సుయ్ జపాన్ గ్రూప్‌నకు చెందిన ఎంటీసీ సంస్థతో చర్చలు జరిపారు. మిత్సుయ్‌లో ఎంటీసీ 25 శాతం వాటా కలిగి ఉంది. తమ సంస్థ విస్తరణ ప్రణాళికలను ఎంటీసీ వివరించింది. తెలంగాణలో పెట్టుబడులు పెట్టడానికి ఆసక్తి కనబరిచింది. ఆ సంస్థకు అవసరమైన భూమిని గుర్తించడానికి త్వరలో కసరత్తు ప్రారంభిస్తామని పరిశ్రమల శాఖ ప్రకటించింది.

**హైదరాబాద్ సంస్థ విజయంపై గర్వంగా ఉంది: సీఎం**

దావోస్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు సమక్షంలో అంతరిక్ష సాంకేతిక రంగానికి చెందిన హైదరాబాద్ సంస్థ 'స్కైరూట్ ఏరో స్పేస్' మంగళవారం రాష్ట్ర ప్రభుత్వంతో అవగాహన ఒప్పందం(ఎంఓయూ) కుదుర్చుకుంది. ఒప్పందం ప్రకారం తెలంగాణలో ఇంటిగ్రేటెడ్ ప్రైవేట్ రాకెట్ తయారీ, ఇంటిగ్రేషన్, టెస్టింగ్ యూనిట్‌ను ఏర్పాటు చేస్తారు. ఈ ప్రాజెక్టు ఏర్పాటుకు స్కైరూట్ కంపెనీ దాదాపు రూ.500 కోట్ల పెట్టుబడి పెట్టనుంది. ఒప్పందంపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. "హైదరాబాద్‌కు చెందిన సంస్థ అత్యాధునిక సాంకేతిక రంగంలో విజయం సాధించటం గర్వంగా ఉంది. తెలంగాణ యువకులు ప్రపంచంలోనే అద్భుతమైన ప్రతిభను ప్రదర్శించడంతోపాటు రాష్ట్రంలో పెట్టుబడులకు ముందుకు వచ్చినందుకు అభినందనలు. స్కైరూట్ కంపెనీతో ప్రభుత్వ భాగస్వామ్యం అంతరిక్ష రంగంపై మా ప్రభుత్వ వ్యూహాత్మక దృష్టిని చాటిచెబుతోంది. త్వరలోనే ప్రైవేట్ రంగ అంతరిక్ష కార్యకలాపాలకు హైదరాబాద్‌ను కేంద్ర బిందువుగా అభివృద్ధి చేస్తాం" అని సీఎం తెలిపారు. తెలంగాణలో పెట్టుబడులు పెట్టడం తమకు సంతోషంగా ఉందని స్కైరూట్ సహ వ్యవస్థాపకులు పవన్‌కుమార్ చందన తెలిపారు.

**పారిశ్రామికవేత్తలతో వరుస సమావేశాలు..**

దావోస్‌లో జరుగుతున్న ప్రపంచ ఆర్థిక వేదిక వార్షిక సదస్సు రెండో రోజైన మంగళవారం సీఎం రేవంత్‌రెడ్డి బృందం వివిధ సదస్సులు, సమావేశాల్లో పాల్గొంది. పలువురు పారిశ్రామికవేత్తలతో భేటీ అయి రాష్ట్రంలో పెట్టుబడులపై చర్చించింది. ఇటీవల తెలంగాణలో అమల్లోకి వచ్చిన క్లీన్ అండ్ గ్రీన్ ఎనర్జీ పాలసీ, పునరుత్పాదక ఇంధనం, పంప్డ్ స్టోరేజీ విద్యుత్తు ఉత్పత్తికి ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలపై దేశ విదేశాల్లో పేరొందిన కంపెనీలు ఆసక్తి చూపుతున్నాయి. హైదరాబాద్‌లో ఫోర్త్ సిటీ అభివృద్ధి, ఏఐ ఆధారిత ఐటీ సేవల విస్తరణ, అత్యాధునిక డేటా సెంటర్ల ఏర్పాటుకు పెట్టుబడులు పెట్టేందుకూ సంప్రదింపులు జరుపుతున్నాయి. అమెజాన్, సిఫీ టెక్నాలజీస్ కంపెనీల ప్రతినిధులతో సీఎం బృందం వేర్వేరుగా చర్చలు జరిపింది. ఐటీ, డేటా సెంటర్లు, క్లీన్ అండ్ గ్రీన్ ఎనర్జీ రంగంలో పెట్టుబడుల ఆకర్షణ లక్ష్యంతోఈ సారి 'ఇండస్ట్రీస్ ఇన్ ఇంటెలిజెంట్ ఏజ్' అనే థీమ్‌ను ప్రపంచ ఆర్థిక వేదిక ఎంచుకుంది. అధునాతన శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానానికి అనుగుణంగా పారిశ్రామిక వ్యూహాల మార్పు, పెరుగుతున్న అవసరాల మేరకు ఇంధనాన్ని సమకూర్చుకోవాలనే ఇతివృత్తంతో రౌండ్ టేబుల్ సమావేశాలు, సెమినార్లు నిర్వహిస్తోంది. ప్రపంచ వ్యాప్తంగా వివిధ దేశాలు, రాష్ట్రాల ప్రతినిధులతోపాటు.. ఆయా రంగాలు, పరిశ్రమలకు చెందిన నిపుణులు, పారిశ్రామికవేత్తలు దాదాపు మూడు వేల మంది ఈ సదస్సులో పాల్గొంటున్నారు. ఈ నేపథ్యంలో భారత పరిశ్రమల సమాఖ్య(సీఐఐ) సారథ్యంలో వివిధ కంపెనీల ప్రతినిధులు, పారిశ్రామికవేత్తలతో ముఖ్యమంత్రి సమావేశమయ్యారు. ప్రధానంగా ఐటీ, డేటా సెంటర్లు, క్లీన్ అండ్ గ్రీన్ ఎనర్జీ రంగంలో పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యంగా తెలంగాణ రైజింగ్ టీమ్ చర్చలు జరుపుతోంది.

## జనసేనకు ఈసీ గుడ్ న్యూస్.. గాజు గ్లాసు గుర్తు రిజర్వ్..

- మొదటి పేజీ తరువాయి

పొందిన పార్టీగా ప్రకటిస్తూ.. గాజు గ్లాసు గుర్తును రిజర్వ్ చేస్తూ పవన్ కళ్యాణ్ కు అధికారిక లేఖ పంపింది ఈసీ.

జనసేన 2019 ఎన్నికల్లో పోటీ చేసి కేవలం ఒక ఎమ్మెల్యే స్థానానికే పరిమితమై ఘోర పరాభవం చవి చూసింది.. ఆ తర్వాత 2024 ఎన్నికల్లో 100 శాతం విజయం నమోదు చేసిన పార్టీగా జనసేన రికార్డు క్రియేట్ చేసింది జనసేన. 100 శాతం స్ట్రైక్ రేట్ తో ఊపు మీదున్న జనసేనకు గుర్తింపు పొందిన పార్టీగా నిలివటం, గాజు గ్లాసు గుర్తు సైతం రిజర్వ్ అవ్వటం మరింత జోష్ ఇచ్చే అంశమని చెప్పాలి.

## ఏపీలో డీఆర్‌వో నిర్వాకం: రివ్యూ మీటింగ్ లో ఆన్‌లైన్ రమ్మీ గేమ్ ఆడుతూ బిజీ

ఈ ఘటనకు సంబంధించి పూర్తి వివరాలిలా ఉన్నాయి. అనంతపురం జిల్లా కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవన్‌లో ఎస్సీ వర్గీకరణపై ఏకసభ్య కమిషన్ చైర్మన్ ఆధ్వర్యంలో సమావేశం జరిగింది... ఈ సమావేశానికి కలెక్టర్లు, జిల్లా పోలీసు యంత్రంగంతో పాటు పలువురు అధికారులు కూడా పాల్గొన్నారు. ఈ సమావేశానికి హాజరైన అనంతపురం డీఆర్‌వో మలోలా రివ్యూ మీటింగ్ ని పట్టించుకోకుండా మొబైల్ లో బిజీగా కనిపించరు.. రెవెన్యూ అధికారి కదా ఏదో ఇంపార్టెంట్ పనిలో బిజీగా ఉండుంటారులే అనుకుంటే మన పొరపాటే అవుతుంది.. ఒక పక్క కీలక రివ్యూ మీటింగ్ జరుగుతుంటే ఈయన గారు తీరిగ్గా ఆన్ లైన్ రమ్మీ ఆడుకుంటూ కూర్చున్నారు. ఇందుకు సంబంధించిన నెట్టింట వైరల్ అవ్వగా.. డీఆర్వో మలోలాపై కామెంట్ల రూపంలో దుమ్మెత్తి పోస్తున్నారు నెటిజన్స్. ఈ ఘటనను సీరియస్ గా తీసుకున్న జిల్లా కలెక్టర్ వినోద్ కుమార్ కీలక సమావేశంలో ఆన్‌లైన్‌లో రమ్మీ ఆడుతున్న డీఆర్వో మలోలపై విచారణకు ఆదేశించారు. ఈ ఘటనపై వివరణ కోరుతూ డీఆర్వోకు నోటీసులు జారీ చేశారు కలెక్టర్. ఇలాంటి ఘటనలు సహించబోనని హెచ్చరించారు కలెక్టర్.

## హైదరాబాద్‌లో ఐటీ సోదాల కలకలం

- మొదటి పేజీ తరువాయి

నిర్మాహకుడు దిల్ రాజు, మైత్రీ మూవీ మేకర్స్ నిర్వాహకులు యెర్నేని నవీన్, యలమంచిలి రవిశంకర్ ఇళ్లు, కార్యాలయాల్లో ఐటీ బృందాలు తనిఖీలు చేపట్టాయి. మంగళవారం ఉదయమే దాదాపు 55 బృందాలు హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, కొండాపూర్, గచ్చిబౌలి తదితర ప్రాంతాల్లో సోదాలకు ఉపక్రమించాయి. బృందాలుగా విడిపోయిన ఐటీ అధికారులు ఏకకాలంలో తనిఖీలను ప్రారంభించి రాత్రి పొద్దుపోయే వరకు నిర్వహించారు. ఈ సందర్భంగా కీలకపత్రాలను స్వాధీనం చేసుకున్నారు.

**కుటుంబసభ్యుల ఇళ్లలోనూ..**

సంక్రాంతికి భారీ బడ్జెట్‌తో సినిమాలు తెరకెక్కించిన నేపథ్యంలో దిల్ రాజు నివాసంలో సోదాలు జరగడం చర్చనీయాంశంగా మారింది. గేమ్‌ఛేంజర్, సంక్రాంతికి వస్తున్నాం.. అనే సినిమాల నిర్మాణానికి భారీగా వెచ్చించినట్లు చెబుతున్నారు. ఈ రెండు చిత్రాల కలెక్షన్ల నేపథ్యంలో తనిఖీలకు ప్రాధాన్యం సంతరించుకొంది. తొలుత బంజారాహిల్స్ సాగర్ సొసైటీలోని దిల్ రాజు కార్యాలయంతో పాటు జూబ్లీహిల్స్ ఉజాస్ విల్లాస్‌లోని ఆయన నివాసంలో సోదాలు చేపట్టారు. అలాగే రాజు కుమార్తె హన్సితారెడ్డి, సోదరుడు నర్సింహారెడ్డి.., శిరీష్ ఇళ్లల్లోనూ బృందాలు తనిఖీల్లో నిమగ్నమయ్యాయి. సోదాల క్రమంలో కొంతసేపటి తర్వాత దిల్ రాజు సతీమణి తేజస్వినిని ఐటీ అధికారులు బ్యాంకులకు తీసుకెళ్లారు. ఆమె పేరిట ఖాతాలున్న బ్యాంకుల్లోని లాకర్లు తెరిపించారు. ఈసందర్భంగా తేజస్విని మీడియాతో మాట్లాడుతూ.. 'ఐటీ అధికారులు బ్యాంకు లావాదేవీల వివరాలు కావాలన్నారు. లాకర్లు తెరిచి చూపాలని అడగడంతో వారికి సహకరించాను. ఇవి సాధారణంగా జరిగే సోదాలే' అని పేర్కొన్నారు.

**మైత్రీ మూవీ మేకర్స్ కార్యాలయంలోకి వెళుతున్న ఐటీ అధికారులు**

**మైత్రీ మూవీ మేకర్స్‌లో..**

మైత్రీ మూవీ మేకర్స్ నిర్వాహకులు నవీన్, రవిశంకర్‌లతో పాటు సీఈవో చెర్రీ ఇళ్లు, కార్యాలయాల్లోనూ ఐటీ అధికారులు సోదాలు చేపట్టారు. భారీ బడ్జెట్‌తో తెరకెక్కిన పుష్ప-2 సినిమా కొద్దిరోజుల క్రితం విడుదలై భారీగా వసూళ్లను రాబట్టినట్లు ప్రచారం జరిగింది. ఈనేపథ్యంలో వసూళ్లకు తగ్గట్టుగా పన్నుల చెల్లింపు అంశానికి సంబంధించి ఐటీ బృందాలు ఆరా తీశాయి. అందుకు సంబంధించిన బ్యాంకు లావాదేవీలను పరిశీలించాయి.

## పాత ఒప్పందం ప్రకారమే నీటి పంపకాలు

సమ్మతి తెలియజేయలేదు. బోర్డు ప్రధాన కార్యాలయం విజయవాడ తరలింపునకు బోర్డు అంగీకారం తెలిపింది. హైదరాబాద్‌లో బోర్డు ఛైర్మన్ అతుల్‌జైన్ అధ్యక్షతన కృష్ణానదీ యాజమాన్య బోర్డు 19వ సర్వసభ్య సమావేశం మంగళవారం నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ నుంచి ఇంజినీర్ ఇన్ చీఫ్ ఎం.వెంకటేశ్వరరావు, అంతర్రాష్ట్ర విభాగం చీఫ్ ఇంజినీరు సుగుణాకరరావు, కృష్ణా ప్రాజెక్టులకు సంబంధించిన ఇతర సీఈలు సమావేశంలో పాల్గొన్నారు. తెలంగాణ నుంచి నీటిపారుదలశాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జా, ఇంజినీర్ ఇన్ చీఫ్ అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. సమావేశంలో కొన్ని అంశాలపై వాడీవేడిగా వాదనలు జరిగాయి.

**50:50 నిష్పత్తి నీటి వాటాలకు ఏపీ ససేమిరా..**

నీటి పంపకాలపై సమావేశంలో బలంగా వాదనలు జరిగాయి. అందుబాటులో ఉన్న నీటిని 50:50 నిష్పత్తిలో రెండు రాష్ట్రాలకూ పంచాలని తెలంగాణ నీటిపారుదలశాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జా పట్టుబట్టారు. ఈ విషయంపై ఇప్పటికే తాము ట్రైబ్యునల్‌లో గట్టిగా పోరాడుతున్నందున తాము ఈ వాటాకు తగ్గి నీటి పంపకాలకు అంగీకరించబోమన్నారు. ప్రస్తుత విధానం 66:34 నిష్పత్తిలోనే నీటి పంపకాలు ఉండాలని ఏపీ ఇంజినీర్ ఇన్ చీఫ్ ఎం.వెంకటేశ్వరరావు వాదించారు. ఇప్పటికే ప్రాజెక్టులకు ట్రైబ్యునల్ నీటి పంపకాలు పూర్తి చేసిందని, ఇప్పుడు ఏ ప్రాజెక్టుకు నీళ్లు తగ్గించుకోగలమని ప్రశ్నించారు. ట్రైబ్యునల్‌లోనూ తాము ఇది వ్యతిరేకిస్తున్నామన్నారు. ట్రైబ్యునల్ నిర్ణయం వెలువడే వరకు పాత ఒప్పందం కొనసాగించాలని (ఏపీకి 512, తెలంగాణకు 299 టీఎంసీలు) బోర్డు నిర్ణయించింది. ఈ పంపకాలను త్రిసభ్య కమిటీ పర్యవేక్షిస్తుంది.

**నీటి మీటర్ల ఏర్పాటుపైనా భిన్నాభిప్రాయాలు**

ఆంధ్రప్రదేశ్ వాడుకుంటున్న నీటిని ఇతర బేసిన్లకు మళ్లిస్తున్నందున ఆ రాష్ట్రంలో అంతర్గత అవుట్‌లెట్‌ల వద్దా నీటిమీటర్లు ఏర్పాటు చేయాలని తెలంగాణ డిమాండ్ చేసింది. ఎక్కడెక్కడ నీటి మీటర్లను ఏర్పాటు చేయాలో ప్రతిపాదించింది. బొల్లాపల్లి, హంద్రీనీవాకు నీళ్లు తీసుకునే మల్యాల, హంద్రీనీవా కాలువల పొడవునా ఇలా అనేక ప్రదేశాల్లో నీటిమీటర్ల ఏర్పాటుకు వారు ప్రతిపాదించారు. అవసరమైతే ఏపీలో నీటిమీటర్ల ఏర్పాటుకు అవసరమైన ఖర్చు తెలంగాణ భరిస్తుందని పేర్కొన్నారు. ఇందుకు ఆంధ్రప్రదేశ్ సమ్మతించలేదు. 'మా నీటిని మేము ఎక్కడైనా వాడుకుంటాం. ఆ హక్కు మాకు ఉంది. ఇందుకు నీటిమీటర్లు ఏర్పాటు చేయాల్సిన అవసరం లేదు' అని ఈఎన్సీ వెంకటేశ్వరరావు స్పష్టం చేశారు. తెలంగాణలో ఎక్కడైనా నీటిమీటర్ల ఏర్పాటు చేయమని కోరవచ్చని ఆ రాష్ట్ర అధికారులు అన్నారు. ఈ అంశాన్ని పరిష్కరించేందుకు ఆరుగురు సభ్యులతో కమిటీ ఏర్పాటు చేసేందుకు బోర్డు ఛైర్మన్ అతుల్‌జైన్ నిర్ణయించారు

## రియల్ ఎస్టేట్ బ్రోకర్ ను కొట్టిన ఎంపీ ఈటల రాజేందర్...

- మొదటి పేజీ తరువాయి

పలువురు బాధితులు కూడా ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో ఈటల రియాల్టీ బ్రోకర్ పై చేయి చేసుకున్నారు. ఇంటి స్థలాల యజమానులను ఇబ్బంది పెట్టడమేమిటని ఆగ్రహం వ్యక్తం చేశారు.అనంతరం ఈటల మాట్లాడుతూ... పేదలు కష్టపడి కొనుక్కున్న స్థలాలకు బీజేపీ అండగా నిలుస్తుందన్నారు. కొందరు అధికారులు బ్రోకర్లకు కొమ్ముకాస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. భూములు కొనుగోలు చేసిన పేదల సమస్యలపై కలెక్టర్, సీపీతో మాట్లాడినట్లు చెప్పారు.

కొందరు దొంగ పత్రాలతో పేదల భూములను లాక్కుంటున్నారన్నారు. బ్రోకర్లకు సహకరించే అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం కూల్చివేతలు తప్ప... పేదల కన్నీళ్లు పట్టించుకోవడం లేదని విమర్శించారు.

## మావోయిస్టులు లేని భారత్ దిశగా ఇది కీలక అడుగు

ఒడిశా-ఛత్తీస్ గఢ్ బోర్డర్ లో భారీ ఎన్ కౌంటర్ జరిగింది. ఈ ఎన్ కౌంటర్ లో 14 మంది మావోయిస్టులను భద్రతాబలగాలు కాల్చి చంపాయి. నిన్న జరిగిన ఎన్ కౌంటర్ లో ఇద్దరు మావోలు హతమయ్యారు. దీంతో, మొత్తం 16 మంది మావోలు చనిపోయినట్టు పోలీసు అధికారులు తెలిపారు. ఎన్ కౌంటర్ జరిగిన ప్రాంతంలో పోలీసులు, సీఆర్పీఎఫ్ సిబ్బంది గాలింపు జరుపుతున్నారు. మరిన్ని మృతదేహాలు లభ్యమయ్యే అవకాశం ఉండొచ్చని అధికారులు చెపుతున్నారు.

మరోవైపు ఈ ఎన్ కౌంటర్ పై కేంద్ర హోం మంత్రి అమిత్ షా స్పందిస్తూ... మావోయిస్టులు లేని భారత్ దిశగా ఇది కీలక అడుగు అని చెప్పారు. మన భద్రతాబలగాలకు ఇదొక గొప్ప విజయమని అన్నారు.

దేశంలో నక్సలిజం కొన ఊపిరితో ఉందని చెప్పారు. ఒడిశా, ఛత్తీస్ గఢ్ కు చెందిన బలగాలు, సీఆర్పీఎఫ్ ఈ ఆపరేషన్ లో పాల్గొన్నాయని తెలిపారు. దేశంలో నక్సలిజం లేకుండా చేస్తామని అన్నారు.

## ఛత్తీస్ గఢ్ ఎన్ కౌంటర్‌లో.. ఇద్దరు తెలంగాణ వాళ్లు మృతి

ఛత్తీస్ గఢ్.. ఒరిస్సా సరిహద్దుల్లోని మెయిన్ పూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని అడవుల్లో జరిగిన ఎన్ కౌంటర్ సంచలనంగా మారింది. 2025, జనవరి 21వ తేదీ తెల్లవారుజామున జరిగిన ఈ ఎన్ కౌంటర్‌లో 14 మంది నక్సల్స్ చనిపోయారు. భద్రతాబలగాలు, నక్సల్స్ మధ్య జరిగిన కాల్పుల్లో వీళ్లు చనిపోయినట్లు కేంద్ర హోంశాఖ ప్రకటించింది. భద్రతా బలగాల కాల్పుల్లో చనిపోయిన 14 మంది నక్సల్స్‌లో ఇద్దరు తెలంగాణ వాళ్లు ఉన్నారు. మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు పాక హన్మంతు అలియాస్ రాజేశ్ తివారి స్వస్థలం నల్లగొండ జిల్లా చండూరు మండలం పుల్లెంల గ్రామం. సిద్దిపేట జిల్లా కోహెడకు చెందిన కట్టా రాంచంద్రారెడ్డి అలియాస్ వికల్ప్ కూడా ఈ ఎన్ కౌంటర్‌లో ప్రాణాలు కోల్పోయాడు. మావోయిస్టుల ఏరివేతే లక్ష్యంగా కేంద్ర, రాష్ట్ర బలగాలు నక్సలైట్లు కంచుకోట దండకారణ్యాన్ని గత రెండు రోజులుగా జల్లెడ పడుతున్నాయి. ఈ క్రమంలోనే ఛత్తీస్ గఢ్.. ఒరిస్సా సరిహద్దుల్లోని మెయిన్ పూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో మావోయిస్టులు, భద్రతా దళాలకు మధ్య భీకర ఎదురు కాల్పులు చోటు చేసుకున్నాయి. దాదాపు రెండు రోజుల పాటు జరిగిన ఈ కాల్పుల్లో మావోయిస్టు పార్టీకి తీవ్ర నష్టం వాటిల్లింది. ఈ ఎన్ కౌంటర్ లో పెద్ద ఎత్తున మావోయిస్టులు మృతి చెందారు. ఇందులో మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు కూడా ఉండటం గమనార్హం.సెంట్రల్ కమిటీ మెంబర్, పార్టీ కీలక నేత చలపతి అలియాస్ రామచంద్రా రెడ్డి అలియాస్ జైరామ్ కూడా ఉన్నట్లు పోలీసులు ధృవీకరించారు. ప్రస్తుతం మావోయిస్టు పార్టీలో కీలక నేతగా ఉన్న చలపతి ద ఆంధ్రప్రదేశ్‌లోని చిత్తూరు జిల్లాకు చెందిన వ్యక్తి. చలపతి హెడ్‌పై వివిధ రాష్ట్ర ప్రభుత్వాలు రూ.కోటి రివార్డు ప్రకటించాయి. ఈ ఎన్ కౌంటర్‌లో ప్రస్తుతం 14 మంది మావోయిస్టులు మృతి చెందగా.. మరికొందరు తీవ్రంగా గాయపడ్డట్లు అధికారులు ధృవీకరించారు. ఘటన స్థలంలో కాల్పులు కొనసాగుతుండటంతో మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది.

## మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్ రెడ్డిపై దాడి

- మొదటి పేజీ తరువాయి

దీంతో కంచర్ల ఆధ్వర్యంలో బీఆర్ఎస్ శ్రేణులు ఆందోళన చేపట్టారు. ఈ క్రమంలో అక్కడే ఉన్న కాంగ్రెస్ వర్గీయులు... భూపాల్ రెడ్డిపై దాడి చేశారు.ఇరుపార్టీ వర్గాలు పరస్పరం దాడులు చేసుకొని... పూలకుండీలు విసురుకు న్నారు. ఈ ఘటనలో కంచర్ల భూపాల్ రెడ్డి సొమ్మసిల్లి పడిపోయారు.

అనంతరం భూపాల్ రెడ్డి మాట్లాడుతూ... మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అనుచరులు, నల్గొండ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి ప్లాన్ ప్రకారమే తమపై దాడి చేయించారని ఆరోపించారు. తమపై ఆయుధాలతో దాడి చేశారన్నారు. విచక్షణ మరిచి మహిళలను వివాదంలోకి లాగుతున్నారని మండిపడ్డారు.

## ఈ సంక్రాంతి సీజన్ లో ఏపీఎస్ఆర్టీసీకి భారీగా ఆదాయం

సంక్రాంతి పండుగ వేళ తెలుగు రాష్ట్రాల్లో ఉండే కోలాహలం గురించి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. సంక్రాంతి సంబరాల కోసం ఎక్కడెక్కడో ఉన్న తెలుగువారు స్వస్థలాలకు చేరుకునేందుకు ఉత్సాహం చూపిస్తుంటారు. దాంతో పండుగకు ముందు, ఆ తర్వాత బస్సులు, రైళ్లు కిటకిటలాడుతుంటాయి. భారీ డిమాండ్ దృష్ట్యా తెలుగు రాష్ట్రాల ఆర్టీసీలు ప్రయాణికుల కోసం సంక్రాంతి సీజన్ లో పెద్ద ఎత్తున అదనపు బస్సులు ఏర్పాటు చేస్తుంటాయి. ఈ నేపథ్యంలో, తాజా సంక్రాంతి సీజన్ లో ఏపీఎస్ఆర్టీసీ రికార్డు స్థాయిలో ఆదాయం కళ్లజూసింది. ఏపీఎస్ఆర్టీసీ ఈ నెల 8 నుంచి 20వ తేదీ వరకు 9,097 అదనపు సర్వీసులు నడిపింది. ఈ నెల 20వ తేదీ ఒక్కరోజునే ఆర్టీసీకి రూ.23.71 కోట్ల ఆదాయం వచ్చింది. మూడు రోజుల పాటు రోజుకు రూ.20 కోట్లకు పైగా ఆదాయం లభించింది. ఈ సంక్రాంతి సీజన్ లో కేవలం ప్రత్యేక బస్సుల ద్వారానే రూ.21.11 కోట్లు వచ్చినట్టు ఏపీఎస్ఆర్టీసీ తెలిపింది.

## డిప్యూటీ సీఎం అంశంపై ఎవరూ బహిరంగంగా మాట్లాడవద్దు:

డిప్యూటీ సీఎం అంశం ఏపీ రాజకీయల్లో కలకలం రేపుతోంది. కూటమి ప్రభుత్వ పాలన ప్రశాంతంగా కొనసాగుతున్న తరుణంలో... నారా లోకేశ్ ను డిప్యూటీ సీఎం చేయాలంటూ కొందరు టీడీపీ నేతలు చేసిన డిమాండ్ చర్చనీయాంశంగా మారింది. ఈ డిమాండ్ లేవనెత్తుతున్న టీడీపీ నేతల సంఖ్య క్రమంగా పెరుగుతుండటంతో జనసేన నేతలు కూడా సీన్ లోకి ఎంటర్ అయ్యారు. లోకేశ్ ను డిప్యూటీ సీఎం చేయాలని టీడీపీ నేతలు కోరుకోవడంలో తప్పు లేదని... తమకు కూడా పవన్ ను సీఎంగా చూడాలని ఉందని వారు కౌంటర్ అటాక్ ఇచ్చారు. ఇప్పటికే ఈ అంశంపై దృష్టి సారించిన టీడీపీ హైకమాండ్ వివాదానికి ముగింపు పలికే విధంగా చర్యలు తీసుకుంది. ఈ అంశంపై ఎవరూ బహిరంగంగా మాట్లాడొద్దని పార్టీ నేతలకు ఆదేశాలు జారీ చేసింది. మరోవైపు ఇదే అంశంపై జనసేన కేంద్ర కార్యాలయం కూడా స్పందించిం ది. డిప్యూటీ సీఎం అంశంపై జనసేన నేతలు, కార్యకర్తలు బహిరంగంగా మాట్లాడొద్దని, సోషల్ మీడియాలో స్పందించవద్దని ఆదేశాలు జారీ

## గణతంత్ర దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలి....

● జనరల్ మేనేజర్ దుర్గం రామచందర్.



**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్),జనవరి 21,**మణుగూరు ఏరియా పీవి కాలనీలోని భద్రాద్రి స్టేడియంలో ఈ నెల 26వ తేదీన నిర్వహించబడే 76వ గణతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా ఏరియా జనరల్ మేనేజర్ దుర్గం రామచందర్ సంబంధిత అధికారుల తో భద్రాద్రి స్టేడియం, పివి కాలనీ గ్రౌండ్ లోని నిర్వహించే పనులను పరిశీలించారు.

ఈ సందర్భంగా జనరల్ మేనేజర్ దుర్గం రామచందర్ మాట్లాడుతూ.. 76వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా నిర్వహించే కార్యక్రమాలను వీక్షించే వారికి, అన్నీ పాఠశాలల నుంచి వచ్చే విద్యార్థులకు తగిన ఏర్పాట్లు చేయాలని, అలాగే వారికి త్రాగు నీటి సదుపాయం, వాళ్ళు కూర్చోవడానికి టెంట్లు, పాఠశాల విద్యార్థులకు ఎలాంటి ఇబ్బంది కలుగకుండా చూడలాని తెలిపారు.

అలాగే సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించెందుకు సంబందించిన పనులను సత్వరమే పూర్తి చేయాలని సంబందిత అధికారులను సూచించారు.

ఈ కార్యక్రమంలో ఎస్ ఓ టు జి ఎం డి శ్యామ్ సుందర్ , ఏజిఎం (సివిల్) డి వేంకటేశ్వర్లు, ఏరియా ఇంజినీర్ ఆర్. శ్రీనివాస్, డిజిఎం పర్సనల్ ఎస్ రమేశ్ , ఎస్ఈ (ఈ, ఎం) ఎన్ మధుసూధన్ , ఏరియా సెక్యూరిటీ అధికారి కే శ్రీనివాస్, డివై.ఎస్ఈ (ఈ, ఎం) శోభన్ బాబు, సీనియర్ పర్సనల్ అధికారులు సింగు శ్రీనివాస్ , వి రామేశ్వర రావు, ఈఈ( సివిల్) డి. వి.ఎ.స్ ఎ.న్ ప్రవీణ్, అసిస్టెంట్ స్పోర్ట్స్ సుపర్వైజర్ జాన్ వెస్లీ, సివిల్ అధికారులు .సివిల్ సుపర్వైజర్ అజయ్, ఫిట్టర్ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

## గ్రామసభ లో.
## సంక్షేమ పథకాలకు అర్హుల ఎంపిక.

● డిటి పుష్ప మేడం సమక్షంలో.



**సీకే న్యూస్ మండలం ప్రతినిధి బాలరాజు జనవరి 21.**యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల పరిధిలోని.ద నరసాయగూడెం గ్రామంలో ప్రజా పాలన గ్రామసభ లో మండల అధికారులు డిప్యూటీ తహసిల్దారి పుష్ప పాల్గొని.

గ్రామసభ నిర్వహించినారు. మీడియా ద్వారా గ్రామ పెద్దలు ఆరోగ్యం, తుమ్మల శ్రీను, మాజీ ఎంపీటీసీ పసల జ్యోతి మాట్లాడుతూ. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సంక్షేమ పథకాలు.

రైతు భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు,ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాలు,మా గ్రామంలో అర్హులైన వారిని ఎంపిక గ్రామసభ ద్వారా చేసినామని మాట్లాడినారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ దామోదర్, సంతోష్ విన్సెట్, బాలరాజు, ఇన్నయ్య, జోజప్ప, బాలశౌరి, గ్రామ సెక్రెటరీ మౌనిక, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## జర్నలిస్టుల సమస్యల పరిష్కారంకు కార్యాచరణ ప్రణాళిక జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు



**సి కె న్యూస్ విశాఖపట్నం ప్రతినిధి ( రవికుమార్ ) జనవరి 21 :** రాష్ట్రంలో వర్కింగ్ జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కారంకు కార్యాచరణ ప్రణాళికను రూపొందిస్తున్నట్లు జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు పేర్కొన్నారు.ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్, ఏపి బ్రాడ్ కాస్ట్ జర్నలిస్టుల అసోసియేషన్, ఏపి స్మాల్ అండ్ మీడియం న్యూస్ పేపర్స్ అసోసియేషన్లు రెండో రోజు మంగళవారం కూడా విశాఖ కలెక్టర్ కార్యాలయం ప్రాంగణంలో ఉన్న ఏపీ ఎన్ జి వో హెూమ్లో వర్కింగ్ జర్నలిస్టుల సభ్యత్వ నమోదు కార్యక్రమం కొనసాగింది. ఈ సందర్భంగా గంట్ల శ్రీనుబాబు మాట్లాడుతూ రాష్ట్రంలో అర్హులైన జర్నలిస్టులందరికి ఇళ్ల స్థలాలు, ఇళ్లు, అక్రిడేషన్ల సదుపాయం కల్పించాలని అలాగే ప్రమాద భీమా పథకాన్ని తిరిగి పునరుద్దరించాలని కోరారు. ఈ మేరకు ఇప్పటికే కూటమి నాయకులకు రాష్ట్ర, జాతీయ యూనియన్ లు వినతిపత్రాలు అందజేశాయన్నారు.విశాఖ అర్బన్ యూనిట్ అధ్యక్షులు పి.నారాయణ్, కార్యదర్శి జి.శ్రీనివాసరావులు మాట్లాడుతూ జర్నలిస్టుల కోసం నియమించిన అన్ని కమిటీల్లోనూ ప్రభుత్వం పాత్రికేయులకు ప్రాతినిధ్యం కల్పించాలన్నారు. అలాగే ఉమ్మడి విశాఖలో గత ఏడాది తమ యూనియన్లలో సుమారు 800 మంది జర్నలిస్ట్ లు సభ్యులుగా చేరినట్లు చెప్పారు. ఈ సారికూడా విశాఖ అర్బన్ యూనిట్ ద్వారా సభ్యత్వ నమోదు కార్యక్రమం ప్రారంభించామని , త్వరలోనే అనకాపల్లి, అల్లూరి జిల్లాల్లో కూడా సభ్యత్వ నమోదు కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. నిరంతరం జర్నలిస్టుల సంక్షేమాని పాటుపడుతున్నామని చెప్పారు.సభ్యత్వ నమోదు కార్యక్రమం పదిహేను రోజుల పాటు కొనసాగుతుందన్నారు. కావున వర్కింగ్ జర్నలిస్టులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఫెడరేషన్ సంయుక్త కార్యదర్శి రాజశేఖర్, కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

# విశాఖ ఉక్కును కాపాడింది చంద్రబాబే మంత్రి కొల్లు రవీంద్ర



**సి కె న్యూస్ విశాఖపట్నం ప్రతినిధి ( రవికుమార్ ) జనవరి 21 :** విశాఖ స్టీల్ ప్లాంట్ కు కేంద్ర సహాయం చేసిందని రాష్ట్ర గనులు భూగర్భ వనరులు ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. మంగళవారం జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో జరిగిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ రాష్ట్ర టిడిపి అధ్యక్షుడు ఉన్న పల్లా శ్రీనివాసరావు ఆమరణ నిరహార దీక్ష చేశారు. ఈ రాష్ట్రానికి అభివృద్ధి స్టీల్ ప్లాంట్ వల్ల సాధ్యం అవుతుంది.

గత వైసిపి పాలన లో కేవలం భూ దోపిడీ కోసం మాత్రమే స్టీల్ ప్లాంట్ వ్యవహారం నడిపారు .రైల్వే జోన్ భవనాలు ప్రధాని చేతులు మీద ప్రారంభించారు.కూటమి ప్రభుత్వానికి ఉన్న చిత్త శుద్ధి కి ఇదే నిదర్శనం.99 శాతం భోగాపురం ఎయిర్ పోర్ట్ ఎర్త్ పనులు పూర్తి అయ్యాయి.

37 శాతం రన్ వే పనులు జరిగాయి.దేశంలో గ్రీన్ ఎనర్జీ లో ఆంధ్ర ప్రదేశ్ ముందు ఉంటుంది.బల్క్ డ్రగ్ పార్క్ ఏర్పాటు కు అడుగులు పడ్డాయి.

అనకాపల్లి లో గ్రీన్ స్టీల్ ప్లాంట్ మీద ఆర్సిలర్ సంస్థ మిట్టల్ తొ సిఎం చంద్రబాబు దావోస్ లో ఏం వో యూ చేసుకున్నారు.ఐదేళ్ల క్రితం జగన్ ప్రభుత్వం విశాఖ లో భూములు కొట్టేశారు.దసపల్లా, వాల్తేరు క్లబ్ భూములు కూడా కొట్టే ప్రయత్నం చేశారు.విశాఖ కు టి సి ఎస్ ,గూగుల్, సంస్థలు వస్తున్నాయి.పోలవరం పనులు వేగంగా జరుగుతాయి.పోలవరం నుంచి బాహుదా వరకు అన్ని ప్రాజెక్టుల పరుగు పెడుతున్నాయి.ఏటా పది వేల క్యూసెక్కుల నీళ్ళు అందించే పనులు జరుగుతున్నాయి.స్టీల్ ప్లాంట్ లో పునరుత్తేజం తెచ్చింది చంద్రబాబు పల్లా శ్రీనివాసరావు రాష్ట్ర తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు గాజువాక శాసనసభ్యులు పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ కేంద్రాన్ని ఒప్పించి డబ్బులు తెచ్చింది చంద్రబాబు స్టీల్ ప్లాంట్ నష్టాల్లో ఉంటే 1998–2000లో బి ఎ ఎఫ్ అర్ కు సహకరం ..అందించారు.ఆ రోజు మూడు వేల కోట్లు ప్రధాని వాజ్ పేయ్ ద్వారా ఇప్పించారు.ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం ఇప్పుడు 11400 కొట్లు ఇచ్చి కాపాడింది చంద్రబాబు.బాబు ఉంటేనే స్టీల్ ప్లాంట్ ఉంటుంది.ఐదేళ్లు వైసిపి నాయకులు ప్లాంట్ కోసం మానేసి కేసులు కోసం మాట్లాడారు తప్ప మరొకటి చెయ్యలేదు .విశాఖ స్టీల్ ప్లాంట్ కోసం కేంద్రం నుంచి 11400 సాయం రావడం అంత చిన్న విషయం కాదు అని అన్నారు కేంద్ర మంత్రి కూమార స్వామి, బిజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురంధేశ్వరి, డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ కు యువ నాయకుడు నారాలోకేష్ కు ధన్యవాదాలు .4.1/2 ఏళ్ళు నుంచి కార్మికులు, నిర్వాసితులు పోరాటం మర్చిపోలేనిది.విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ జరుగుపోతుందని

అపోహలు సృష్టిస్తున్నారు.టిడిపి కోటి మంది సభ్యత్వం మైలురాయి దాటింది.

ఈసారి సాంకేతిక బాగా వినియోగించాం

కేవలం 15 సెకన్లు లో మెంబర్ షిప్ ప్రక్రియ పూర్తి అయ్యింది.ఈ ఘనత పార్టీ వ్యవస్థాపకులు నందమూరి తారక రామారావుదే 30 ఏళ్ల పార్టీ నడిపిన చంద్రబాబు, నూతన సాంకేతిక జోడించిన యువ నాయకులు నారా లోకేష్ ఘనత.రెండేళ్ల పాటు విశాఖ స్టీల్ ప్లాంట్ ను 99 శాతం కెపాసిటీ నడిపితే సెయిల్ లో విలీనం చేయాలని కోరుతాం.స్టీల్ ప్లాంట్ కు సొంత గనులు ఇస్తే ఇంకా బాగుంటుంది.స్టీల్ ప్లాంట్ కోసం పోరాడిన నిర్వాసితులు సమస్య కూడా పరిష్కరించడానికి ఆలోచన చేస్తున్నాం.స్టీల్ ప్లాంట్ ఈ ప్రాంత సెంటిమెంట్ గడిచిన ఐదేళ్ళ దుర్మార్గపు పాలన నడిచింది.గంగవరం పోర్టు లో వాటా అమ్మేశారు.కనీసం ఒక్కరోజు కూడా కార్మికులు దగ్గరకు వైసిపి నాయకుడు జగన్ వెళ్ళారా.కేవలం స్టీల్ ప్లాంట్ భూములు కొట్టేసే ప్రయత్నం చేశారు. సమావేశంలో రాష్ట్ర కోఆపరేటివ్ ఆయిల్ సీడ్స్ గ్రోవర్స్ ఫెడరేషన్ చైర్మన్ జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు గండి బాబ్జి, రాష్ట్ర రోడ్లు భవనాలు చైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

## వివేకానంద స్ఫూర్తిగా సమాజ సేవలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలి సిపి శంఖబ్రత బాగ్చీ



**సి కె న్యూస్ విశాఖపట్నం ప్రతినిధి ( రవికుమార్ ) జనవరి 21** : సమాజ సేవలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని విశాఖ నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చీ పేర్కొన్నారు.

మంగళవారం స్వామి వివేకానంద జయంతోత్సవాలలో భాగంగా వన్ టౌన్ లో గల వివేకానంద సంస్థ ప్రాంగణంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.

ఈ సందర్భంగా విద్యార్థులకు పుస్తకాలు,పెన్నులు, ఫ్లా%శీ%క్ లు అలాగే సంస్థ మహిళా సభ్యులకు దేవుని చిత్ర పటాలను అందజేశారు.అలాగే అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సిపి శంఖబ్రత బాగ్చీ మాట్లాడుతూ నిస్వార్థంగా చేసే సేవలే గుర్తింపు ఇస్తాయని అన్నారు.

పేద బడుగు బలహీన వర్గాలకు చెందిన ప్రజలకు చేదోడు, వాదోడుగా నిస్వార్థ సేవలు అందించడం ఎంతో గొప్ప విషయమని కొనియాడారు.

విశాఖను నేర రహిత నగరంగా తీర్చిదిద్దడానికి పోలీస్ సిబ్బంది తో కలిసి పని చేస్తున్నానని చెప్పారు.

ఈ కార్యక్రమానికి ప్రజలు మమేకం కావాలని అన్నారు.ఎక్కడ నేరాలు జరిగిన, అవినీతి అక్రమాలు జరిగిన ప్రజలు తన ఫోన్ నెంబర్ కు నేరుగా పిర్యాదు చేయవచ్చని అన్నారు.

లీడర్ దినపత్రిక ఎడిటర్ వి.వి.రమణ మూర్తి మాట్లాడుతూ వివేకానంద స్వచ్ఛంద సంస్థ నిస్వార్థంగా చేపడుతున్న సేవా కార్యక్రమాలను కొనియాడారు.ఈ సంస్థ నిర్వహిస్తున్న ప్రతీ కార్యక్రమంలో తాను భాగస్వామ్యం కావడం సంతోషంగా ఉందని తెలిపారు.

స్వామి వివేకానంద ఆశయాలను ప్రజల మధ్యకు తీసుకెళ్లి ప్రచారం చేస్తున్న ఈ సంస్థకు అభినందనలు తెలిపారు.

ఆకలితో ఉన్న పేదలకు ఎంతో రుచికరమైన నాణ్యతతో కూడిన పద మూడు రకాల భోనవాలు అందిస్తూ

వారి ఆకలిని తీరుస్తూ సమాజ నిస్వార్థ సేవలు అందజేస్తున్నారని వెల్లడించారు.వైకాపా

యువ నాయకులు ద్రోణం రాజు శ్రీవత్సవ మాట్లాడుతూ నిరంతరం ఎటువంటి విసుగు విరామం లేకుండా సామాజిక సేవలతో పాటు పేదలకు ,రోగులకు, అన్నార్తులకు సంవత్సరాలు తరబడి డొక్కా సీతమ్మ పేరున అన్నదానం నిర్వహించడం అందరికి స్ఫూర్తిని ఇస్తుందన్నారు.

ఈ కార్యక్రమంలో అడ్వొకేట్ పోతురాజు, వన్ టౌన్ సిఐ జి.దేవుడు బాబు,పశుపతి,

స్వామి,సంస్థ అధ్యక్షులు ఎస్.అప్పారావు, మహిళ సభ్యులు ఉమాదేవి, కనకమహాలక్ష్మి,

సుజాత, రత్న, రాణి,ధనలక్ష్మి ,ట్యూషన్ విద్యార్థులు పాల్గొన్నారు.

## క్యాట్ ఒలంపియాడ్ లో శ్రీ చైతన్య టెక్నో స్కూల్ విద్యార్థుల ప్రభంజనం




**సికె న్యూస్ ప్రతినిధి NTR సర్కిల్ ఖమ్మం** : స్థానిక ఎన్టీఆర్ విగ్రహం వద్ద గల శ్రీ చైతన్య టెక్నో స్కూల్ ఇంటర్నేషనల్ క్యాట్ ఒలంపియాడ్ రెండవ లెవెల్ పరీక్షలో నగదు (క్యాష్) బహుమతులు, గోల్డ్ మెడల్స్ మరియు సర్టిఫికెట్లు సాధించారు. ప్రిన్సిపాల్ పివిఆర్ మురళీమోహన్ మాట్లాడుతూ క్యాట్ ఒలంపియాడ్ పరీక్షలలో అధిక ఉత్తీర్ణతతో విజయం సాధించడం తనకెంతో గర్వకారణం అని మొత్తం 137 మంది విద్యార్థులు సెలెక్ట్ అవ్వగా అందులో 12 మంది నగదు బహుమతి మరియు 125 మంది విద్యార్థులు గోల్డ్ మెడల్స్ మరియు సర్టిఫికెట్స్ సాధించారని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో శ్రీ చైతన్య విద్యాసంస్థల చైర్మన్ శ్రీ మల్లెంపాటి శ్రీధర్, డైరెక్టర్ శ్రీమతి శ్రీవిద్య, పాఠశాల ప్రిన్సిపాల్ పివిఆర్ మురళీమోహన్, వైస్ ప్రిన్సిపాల్ శ్రీమతి నివేదిత, డీన్ , ఒలంపియాడ్ ఎగ్జామ్ ఇన్చార్జెస్ కవిత మమత గార్లు, ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు, విద్యార్థులు , విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## గ్రామ సభను పరిశీలించిన కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు చింతిరాల అరుణ్ రాజ్.

ప్రతి గ్రామసభలో స్థానికుల సలహాలు సూచనలు తప్పక తీసుకోవాలి.

**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్),జనవరి 21,**దుమ్ముగూడెం మండలం గంగోలు గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద జరుగుతున్న గ్రామసభలో కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు చింతిరాల అరుణ్ రాజ్ పాల్గొని అధికారులు నమోదు చేస్తున్న సమాచారాన్ని పరిశీలించారు.ఈ సందర్భంగా అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ పథకం అందుతుందని ఎవరు అధైర్య పడాల్సిన అవసరం లేదు అధికారులు అడిగిన సమాచారాన్ని నమోదు చేసి అప్లికేషన్ అధికారులకి ఇవ్వాలని గ్రామస్తులకు



తెలిపారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు,కుసిని రవికుమార్,సురేష్,ప్రవీణ్, రాజు,సతిష్ గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు...

## విశాఖ బిజెపి కార్యాలయంలో జిల్లా అధ్యక్షులుగా బాధ్యతలు స్వీకరించిన పరశు రామరాజు

● పదవి బాధ్యతల స్వీకరణ కార్య క్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే పి విష్ణు కుమార్ రాజు




**సి కె న్యూస్ విశాఖపట్నం ప్రతినిధి ( రవికుమార్ ) జనవరి 21 :** బీజేపీ నూతన అధ్యక్షులు పరశురామరాజు కామెంట్స్ విశాఖ జిల్లా అధ్యక్షునిగా అవ కాశం ఇచ్చిన పార్టీ అధిష్టానానికి ధన్యవాదాలు బీజేపీ పార్టీలో విశాఖకు ప్రత్యేక స్థానం ఉంది బీజేపీకి కార్యకర్తలు ఎక్కువగా ఉన్నది విశాఖ లోనే పార్టీ నాపై పెట్టిన బాధ్యతను తుచ్ఛతప్ప కుండా పాటిస్తూ పార్టీ బలో పేతానికి కృషి చేస్తాను.ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు కామెంట్స్ విశాఖ జిల్లా అధ్యక్షునిగా పరుశు రామరాజు పేరును రాష్ట్ర పార్టీ అధిష్టానం ప్రకటించింది పరశు రామరాజు బీజేపీ లో చురుకైన పాత్ర పోషించారు ఆరుకు పార్ల మెంట్ ఇంచార్జిగా బీజేపీ స్టేట్ బిల్డింగ్ కమిటీ మెంబెర్ గా పని చేస్తున్నారు ఆరు నియోజకవర్గా లను పరుశురామరాజు సమ న్వయం చేసుకుంటారు బీజేపీకి అతి ముఖ్యమైన ప్రాంతం విశాఖ పరుశురామరాజు పదవికి వన్నె తెచ్చే విధంగా అందరిని సమ న్వయం చేసుకుంటూ ముందుకు వెళ్తారని ఆశిస్తున్నాము.

## శ్రీశ్రీశ్రీ మెట్టమాంబ బండి మాంబ దుర్గ మాంబ అమ్మవార్ల తీర్థ మహెూత్సవంలో పాల్గొన్న గండి బాబ్జి



**సి కె న్యూస్ విశాఖపట్నం ప్రతినిధి ( రవికుమార్ ) జనవరి 21 :** చింతల అగ్రహారంలో కొలువై యున్న శ్రీశ్రీశ్రీ మెట్టమాంబ,బండి మాంబ,దుర్గ మాంబ అమ్మవార్ల తీర్థ మహెూత్సవం పురస్కరించు కొని త్రిమాత ఆలయ కమిటీ ఆహ్వానం మేరకు ముఖ్య అతిథిలుగా పాల్గొన్న మాజీ శాసనసభ్యులు,ఏపీ ఆయిల్స్ సీడ్స్ చైర్మన్ %డ% పెందుర్తి నియోజకవర్గం టిడిపి ఇంచార్జ్ గండి బాబ్జి,మరియు బిజెపి నేత,జీవీఎంసీ 95వ వార్డు కార్పొరేటర్ ముమ్మన దేముడు ను కోలాటం నృత్యాలుతో ఆలయ కమిటీ,గ్రామ పెద్దలు ఘనంగా స్వాగతించారు,అనంతరం గండి బాబ్జి,ముమ్మన దేముడు అమ్మవార్లకు విశేష పూజ అభిషేకాలు చేసారు,కార్యక్రమంలో శ్రీశ్రీశ్రీ త్రిమాత ఆలయ కమిటీ సభ్యులు,మరియు సర్పంచ్ దాడి గోపి వెంకటలక్ష్మి,వైస్ ఎంపీపీ దాడి వరలక్ష్మి,అర్జున్,మాజీ ఎంపీపీ కాళ్ళ వరలక్ష్మి,ఆళ్ల తాతారావు,త్రిమాత ఆలయ కమిటీ అధ్యక్షులు మద్దాల శ్రీనివాసరావు,పి.అప్పారావు,పి.వెంకటరావు,పిడివి.ప్రసాద్, సదరం భీమేష్,కాళ్ళ సన్యాసిరావు,కాళ్ళ జగన్ మోహన్,కర్రి శివ,కోరుబిల్లి సంతోష్,అధిక సంఖ్యలో గ్రామ యువత,భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పథకాల అమలుకు పారదర్శకంగా అర్హుల ఎంపిక.....

- జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్
- పథకాల అమలు నిరంతర ప్రక్రియ
- నూతన కార్యక్రమాల లబ్ధిదారుల జాబితాపై అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలి
- ఖమ్మం రూరల్ మండలం గోళ్ళపాడు గ్రామం, ఖమ్మం నగరం 6వ డివిజన్ లో నిర్వహించిన గ్రామ/ వార్డు సభలలో పాల్గొన్న జిల్లా కలెక్టర్



**సికె న్యూస్ ప్రతినిధి ఖమ్మం:** ప్రభుత్వ పథకాల అమలుకు పారదర్శకంగా అర్హులను ఎంపిక చేస్తున్నామని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు.

మంగళవారం జిల్లా కలెక్టర్, ఖమ్మం రూరల్ మండలం గోళ్ళపాడు గ్రామం, ఖమ్మం నగరం 6వ డివిజన్ లో నాలుగు నూతన పథకాల అమలుపై నిర్వహించిన గ్రామ/ వార్డు సభలలో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ, ప్రభుత్వం నూతనంగా అమలు చేయనున్న నాలుగు పథకాల అర్హుల ప్రాథమిక జాబితాను పరిశీలించి చేర్పులు, మార్పులు ఏవైనా ఉంటే చర్చ పెట్టుకోవాలని అన్నారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, రైతు భరోసా, నూతన రేషన్ కార్డుల మార్గదర్శకాలను గ్రామ వాట్సప్ గ్రూపులు, న్యూస్, అధికారుల ద్వారా తెలియజేశామని అన్నారు.

4 నూతన కార్యక్రమాలకు సంబంధించి క్షేత్ర స్థాయి పరిశీలన చేసి లబ్ధిదారుల యొక్క ప్రాథమిక జాబితా గ్రామసభలలో పెడుతున్నామని, ఎక్కడ ఎటువంటి దాపరికాలు లేకుండా, పూర్తి పారదర్శకంగా ప్రజలకు తెలిసేలా పథకాల అమలు ఉంటుందని, జాబితాలో అనర్హులు ఎవరైనా ఉంటే వివరాలు అందించాలని మళ్లీ విచారణ చేయిస్తామని అన్నారు.

ప్రాథమిక జాబితాలో అర్హులు ఎవరైనా లేని పక్షంలో గ్రామ సభలలో లేదా ఎంపీడీవో కార్యాలయం, తహసిల్దార్ కార్యాలయాలలో ఉన్న ప్రజా పాలన కేంద్రాలలో మళ్లీ దరఖాస్తులను తీసుకుంటున్నామని కలెక్టర్ తెలిపారు. ఆ దరఖాస్తులను పరిశీలించి అర్హులైన వారికి పథకాల లబ్ది చేకూరుస్తామని అన్నారు. గ్రామ సభ/వార్డు సభల వద్ద హెల్ప్ డెస్క్ ఏర్పాటుచేసినట్లు, జాబితా లో పేర్లు సరిచూసుకోనుటకు, జాబితాలో పేర్లు లేని వారికి దరఖాస్తు పెట్టుకొనుటకు అధికారులు సహకరిస్తారని కలెక్టర్ తెలిపారు.

ప్రస్తుతం గ్రామ సభలలో పెట్టిన జాబితా, ప్రాథమిక జాబితా మాత్రమేనని తుది జాబితా కాదని, ప్రజలు ఎవరు ఆందోళన చెందకుండా ఉండాలని, పథకాల అమలు నిరంతర ప్రక్రియ అని, అర్హులందరికీ పథకాలు అందుతాయని కలెక్టర్ అన్నారు.

ఈ సమావేశంలో ఖమ్మం రూరల్ మండల ప్రత్యేక అధికారిణి/జిల్లా బిసి సంక్షేమ అధికారిణి జి. జ్యోతి, ఖమ్మం ఆర్డీవో నర్సింహారావు, వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు సరిత, ఖమ్మం రూరల్ మండల తహసీల్దార్ రాంప్రసాద్, ఎంపీడీఓ కుమార్, ఏపీఎం శ్రీదేవి, పంచాయతీ కార్యదర్శి ధనలక్ష్మి, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# సంక్రాంతి ముగ్గుల పోటీ విజేతలకు బహుమతుల ప్రధానం....



**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్ ),జనవరి 21,** సంక్రాంతి సందర్భంగా ఈనెల 15 వ తేదీన భద్రాచలం పట్టణంలో దిశా ప్రొటెక్షన్ వెల్ఫేర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ముగ్గుల పోటీల లో గెలిచిన విజేతలకు మంగళవారం బహుమతులను అందించారు. ఈ సందర్భంగా దిశ ప్రొడక్షన్ వెల్ఫేర్ ఫౌండేషన్ భద్రాద్రి, కొత్తగూడెం జిల్లా అధ్యక్షురాలు పూజల లక్ష్మి మాట్లాడుతూ జాతీయ చైర్మన్ బీవీ రాజు వైస్ చైర్మన్ కళ్యాణిల ఆదేశాను సారం ప్రతి సంవత్సరం సంక్రాంతి సందర్భంగా మహిళలకు యువతల కు ముగ్గుల పోటీ నిర్వహించి బహుమతులు అందించడం ఆనవాయితీగా వస్తుందని అన్నారు. ఈ సంవత్సరం కూడా పట్టణం లోని రెండు సెంటర్ల లో ముగ్గుల పోటీలు నిర్వహించి గెలిచిన విజేతలకు బహుమతులు అందిస్తామని అన్నారు. ఈ పోటీల ద్వారా మహిళల్లో దాగి ఉన్న ప్రతి వెలికి తీసే అవకాశాలు ఉంటున్నాయని భవిష్యత్తు లో మహిళల కోసం మరిన్ని కార్యక్రమం నిర్వహించేందుకు దిశ ప్రొటెక్షన్ వెల్ఫేర్ ఫౌండేషన్ సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పిట్టల కమలమ్మ స్రవంతి బి అరుణ తదితరులు పాల్గొనగా విజేతలకు చీరలు బహుమతిగా అందించారు

## నాలుగు రోజుల పాటు గ్రామసభలు నిర్వహించాలి.

ఎం బి నర్సారెడ్డి సిపిఐఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు...!



**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్ ),జనవరి 21,** 20 వార్డుల విస్తీర్ణ తో ఉమ్మడి ఖమ్మం జిల్లాలోనే అతిపెద్ద పంచాయతీ గా ఉన్న భద్రాచలం మేజర్ గ్రామ పంచాయతీలో సంక్షేమ పథకాల లబ్ధిదారులను ఎంపిక చేసేందుకు నాలుగు రోజులపాటు గ్రామసభ నిర్వహించి లబ్ధిదారులు ఎంపిక జరగాలని సిపిఐ ఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎంబీ నర్సారెడ్డి డిమాండ్ చేశారు. ఈనెల 26వ తారీకు నుండి ప్రభుత్వం ప్రారంభిస్తున్న నాలుగు పథకాలు నిజమైన అర్హులకు అందాలంటే పట్టణంలోని 20 వార్డులను ఒకరోజు ఐదు వార్డులు చొప్పున నాలుగు రోజుల పాటు గ్రామ సభలు నిర్వహించి గతంలో దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులను అదేవిధంగా నూతనంగా దరఖాస్తు చేసుకునే లబ్ధిదారుల జాబితాలను తయారు చేసి పారి దర్శకంగా అర్హులను గుర్తించాలని ఆయన కోరారు. ఇప్పటికే రేషన్ కార్డులు సొంత ఇల్లు లేక వేలాది మంది పేదలు నూతన ప్రభుత్వం పై ఆశగా ఎదురుచూస్తున్నారని అరులైన వారందరికీ ఇందిరమ్మ ఇల్లు రేషన్ కార్డులు రైతు భరోసా తదితర సంక్షేమ పథకాలు అందాలంటే అధికారులు హడావుడిగా ఒక్కరోజు గ్రామ సభ పెట్టి గందర గోళానికి గురి చేయవద్దని నర్సారెడ్డి హితవు పలికారు. తక్కువ రోజులలో ఇందిరమ్మ ఇల్లు రేషన్ కార్డులు సర్వే కొరకు అధికారులు బిఎల్ఓ లను ఒత్తిడికి గురి చేయటం సరైనది కాదని బిఎల్వోలు ఉదయం 6 గంటల నుంచి రాత్రి 10:00 దాకా సర్వే చేయాల్సిన పరిస్థితి వస్తుందని అధికారులు గమనించి లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ మరిన్ని రోజులు పొడిగించి అర్హులైన ప్రతి పేదవాడికి సంక్షేమ పథకాలు అందే విధంగా కృషి చేయాలని లేని పక్షంలో సిపిఐ ఎం ఆధ్వర్యంలో పోరాటాలు ప్రారంభిస్తామని హెచ్చరించారు

# అయితగాని జనార్ధన్ కు తెలుగు కీర్తి అవార్డు

- వరల్డ్ రైటర్స్ ఫోరం, వరల్డ్ పోయెట్రీ అకాడమి, టీ ఏ ఎన్ ఎ బుక్ ఆఫ్ రికార్డ్స్ మరియు శ్రీ శ్రీ కళావేదికల సంయుక్త సత్కారం



**సి కె న్యూస్ ప్రతినిధి,** తెలుగు సాహితీ లోకంలో వివిధ సాహిత్య ప్రక్రియల్లో ప్రతిభను కనబరిచిన వారికి శ్రీ శ్రీ కళావేధిక మరియు వరల్డ్ రైటర్స్ ఫోరం, వరల్డ్ పోయెట్రీ అకాడమి, టీ ఏ ఎన్ ఎ బుక్ ఆఫ్ రికార్డ్స్ వారు సంయుక్తంగా జాతీయ ప్రతిభా పురస్కారాలు అందించారు. విజయవాడ నగరంలో శ్రీ కౌత పూర్ణానంద విలాస్ కళావేధికలో జరిగిన జాతీయ స్థాయి కార్యక్రమంలో ఈ అవార్డుల ప్రధానోత్సవం నిర్వహించారు. ఉమ్మడి తెలుగు రాష్ట్రాలకు చెందిన సాహిత్యంలో ప్రతిభ కనబరిచిన యువ కవులకు, రచయితలకు ఈ అవార్డులు అందజేశారు. విశిష్టమైన ఈ కార్యక్రమంలో ఖమ్మం జిల్లాకు చెందిన అయితగాని జనార్ధన్ సాహితీ ప్రతిభకు గాను ఆయనకు తెలుగు కీర్తి అవార్డు అందజేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బోయి భీమన్న సతీమణి బోయి హైమావతి, శ్రీ శ్రీ కళావేధిక సీ ఈ ఓ డాక్టర్ కత్తిమండ ప్రతాప్, జాతీయ కన్వీనర్ రమావతి, ఈశ్వర్ భూషణ్, బోయపాటి చంద్రశేఖర్, తీగల సుదర్శన్ తో బాటు రెండు తెలుగు రాష్ట్రాల సాహితీ వేత్తలు, కవులు, కళాకారులు పాల్గొన్నారు.

# విశాఖ ముత్యాలమ్మపాలెం సముద్ర తీరం పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి సి.ఎం.రమేష్



**సి కె న్యూస్ విశాఖపట్నం ప్రతినిధి ( రవికుమార్ ) జనవరి 21 :** గత డిసెంబర్ నెలలో జరిగిన పార్లమెంట్ సమావేశాలలో ముత్యాలమ్మపాలెం సముద్ర తీరాన్ని పర్యాటక ప్రాంతంగా తీర్చి దిద్దాలని అనకాపల్లి పార్లమెంట్ సభ్యులు సి.ఎం. రమేష్ లోక్ సభ 377 నిబంధన కింద చర్చించిన అంశాన్ని సంబంధిత శాఖకు పరిశీలన నిమిత్తం పంపించడం జరిగిందని తెలియజేస్తూ కేంద్ర సాంస్కృతిక, పర్యాటక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ అనకాపల్లి ఎంపీ కి లేఖ వ్రాశారు.

కేంద్ర పర్యాటక మంత్రిత్వ శాఖ వివిధ ప్రాంతాలలో పర్యాటకాభివృద్ధిని స్వదేశ్ దర్శన్ (ప్రసాద్) కింద చేపట్టే ప్రయత్నాలలో భాగంగా ముత్యాలమ్మపాలెం సముద్ర తీరాన్ని అభివృద్ధి చేసే పనిని చేపడుతుందని శ్రీ షెకావత్ లేఖలో పేర్కొన్నారు.

కేంద్ర పర్యాటక మంత్రిత్వ శాఖ ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రానికి అనేక పర్యాటక ప్రాజెక్టులను మంజూరు చేసిందని వాటికి సంబంధిచిన వివరణాత్మక నివేదికలు, నిధుల వినియోగ వివరాలు అందజేయవలసిందిగా ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర టూరిజం శాఖ కార్యదర్శిని కోరడం జరిగిందని ఈ లేఖ ద్వారా ఎంపీకి తెలియజేశారు. ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాన్ని పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దడానికి అవసరమైన ఆర్థిక సహాయాన్ని అందజేస్తామని తెలిపిన కేంద్ర పర్యాటక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ కు ఎంపీ సి.ఎం. రమేష్ కృతజ్ఞతలు తెలియజేశారు.

# లక్ష్యాలకు మించి ఇళ్ల నిర్మాణాలకు కృషిచేయాలి జిల్లా కలెక్టరు విజయ కృష్ణన్



**సి కె న్యూస్ విశాఖపట్నం ప్రతినిధి ( రవికుమార్ ) జనవరి 21:** జిల్లాలో లక్ష్యాలకు మించి ఇళ్లు నిర్మాణాలు చేపట్టాలని జిల్లా కలెక్టరు విజయ కృష్ణన్ గృహనిర్మాణశాఖ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరు కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన సమావేశంలో గృహనిర్మాణాల పురోగతిపై సమీక్ష నిర్వహించారు. సమీక్షా సమావేశంలో జిల్లా కలెక్టరు మాట్లాడుతూ ఇళ్లు నిర్మాణాలు త్వరగా పూర్తిచేయాలని తెలిపారు. ఇళ్ల నిర్మాణాలు త్వరగా పూర్తిచేయుటకు లబ్దిదారులకు అవసరమైన సహకారాన్ని అందించాలని తెలిపారు. లక్ష్యానికి మించి ఇళ్లు నిర్మాణ పనులు చేపట్టాలని, స్టేజి వారీగా పనులు పురోగతి సాధించాలని తెలిపారు. లక్ష్యాలను పూర్తిచేయుటకు ప్రణాళిక తయారు చేసుకోవాలని, ప్రతి వారానికి స్టేజి వారీగా పురోగతి వచ్చేలా పనులు చేపట్టాలని తెలిపారు. అర్హులైన గృహనిర్మాణదారులకు ఉపాధి హామీ పథకం ద్వారా 90 రోజుల పని దినాలు కల్పించాలని తెలిపారు. లే అవుట్ లలో మౌళిక సదుపాయాలు కల్పించాలన్నారు. ప్రతి ఇంటికి వ్యక్తిగత మరుగుదొడ్లు నిర్మించాలని, దానికి సంబంధించి ప్రభుత్వం అందిస్తున్న సహాయాన్ని లబ్దిదారులకు అందించాలని తెలిపారు. లబ్దిదారులకు స్టేజివారీ పేమెంట్స్ సకాలంలో జమ అయ్యేవిధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టరు తెలిపారు. సమావేశంలో గృహనిర్మాణ శాఖ ప్రోజెక్టు డెట్కరెక్టరు వై. శ్రీనివాస్, మండల ఇంజనీర్లు, వర్క్ ఇనస్పెక్టర్లు పాల్గొన్నారు.

## నన్ను ధరించి నీ ప్రయాణం సాగించు.

మోటార్ వెహికల్స్ ఇన్స్పెక్టర్ సంగం వెంకట పుల్లయ్య.




**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్),జనవరి 21,** జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాలు సందర్భంగా రోడ్డు ప్రమాదాలను నివారించడంలో హెల్మెట్ ఆవశ్యకతను ప్రజలకు అందించేందుకు మోటార్ వెహికల్స్ ఇన్స్పెక్టర్ సంగం వెంకట పుల్లయ్య వినూత్న ప్రచారాన్ని ప్రారంభించారు. మంగళవారం నాడు కూనవరం రోడ్డులో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా హెల్మెట్ ధరించ కుండా ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహన డ్రైవర్లకు హెల్మెట్ ఆవశ్యకతను వినూత్నంగా వివరించారు. బాధ్యత గల పౌరులుగా, తప్పకుండా హెల్మెట్ పెట్టుకొని ప్రయాణం చేయాలనే సందేశాన్ని స్పష్టం చేస్తూ, హెల్మెట్ ధరించకుండా ప్రయాణం చేస్తున్న వారికి నమస్కారం చేయడం ద్వారా అవగాహన కల్పించడం చాలా మందిని ఆలోచింపజేసింది.

"నన్ను ధరించు – నిన్ను రక్షిస్తా" అనే సందేశంతో, హెల్మెట్ ధరించడమంటే ప్రాణాల పట్ల బాధ్యతగల మనుగడ అని ప్రజలకు వివరించారు. హెల్మెట్ రిక్వెస్ట్ చేస్తోంది: "నన్ను ధరించి నీ ప్రయాణం సాగించు. నీ ప్రాణాలను కాపాడుతా" అంటూ ప్రజల దృష్టిని ఆకర్షించారు.


భద్రాచలం ఆర్టీఏ కార్యాలయంనకు వచ్చే దరఖాస్తుదారులు, డ్రైవర్లకు ఉదాహరణలతో అవగాహన కల్పిస్తున్నట్లు వెంకట పుల్లయ్య తెలిపారు. ప్రతిరోజూ జరిగే రోడ్డు ప్రమాదాలు నివారించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని, హెల్మెట్ ధరించడం లో నిర్లక్ష్యం చేయవద్దని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కానిస్టేబుల్ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# పేద విద్యార్థులకు మరో ధైర్యం పరంజ్యోతి



**(సీ కే న్యూస్) చేగుంట :** మెదక్ జిల్లా చేగుంట మండల పట్టణ కేంద్రంలో, పెద కుటుంబాలకు చెందిన విద్యార్థులకు,మరియు అంబేద్కర్ యూత్ అసోసియేషన్ క్రీడాకారులకు చేగుంట సంఘ సేవకర్త, వాలీబాల్ మెదక్ జిల్లా అసోసియేషన్ అధ్యక్షులు చేగుంట మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు అయిత పరంజ్యోతి వారికి చేయూతగా నిలుస్తూ విద్యార్థులకు వాలీబాల్ నెట్టు అందజేశారు. మంగళవారం నాడు చేగుంట ఎస్సీ కాలనీలో అంబేద్కర్ యూత్ అసోసియేషన్ సభ్యులను నిర్దేశించి వారు మాట్లాడుతూ, పెద్ద కుటుంబాలకు చెందిన వారికి చదువుతోపాటు క్రీడాలు కూడా ఎంత ముఖ్యం, కాని వారికి ఆర్థిక స్థోమత లేక వెనుకడుగు, వేస్తున్నారు, కూడా,కానీ క్రీడాలపై ఆసక్తి ఉన్న విద్యార్థులకు చదువుతోపాటు క్రీడాలపై ఎంతో ఆశ,అందుకు సంఘ సేవకులు అయిత పరంజ్యోతి, వారికి అండగా నిలుస్తూ మీకు నేనున్నాను అంటూ, మీరు పేదవారు కాదు, అనే ఆలోచనను నిష్క్రమించి, క్రీడలపై ఆసక్తి చూపి చేగుంట గ్రామానికి మెదక్ జిల్లాకు తెలంగాణ రాష్ట్రానికి ఎన్నో విజయాలు అందించాలని వారు కోరారు, మరి ముఖ్యంగా మీ కుటుంబాలలో మీ తల్లి తండ్రి ఆశయాలు నెరవేర్చాలని వారు, కోరారు, ఈ కార్యక్రమంలో చేగుంట కాంగ్రెస్ పార్టీ, నాయకులు సంఘ సేవకర్త అయిత పరంజ్యోతి, జోకుంటి రాజా గౌడ్, ఎన్ పంచాక్షరి,వాలీబాల్ క్రీడాకారులు పొట్టి దుర్గాప్రసాద్, నవీన్,బాలేష్, అక్బర్, గణేష్,ప్రేమ్, తదితరులు పాల్గొన్నారు

# కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులకు ఘన నివాళులు అర్పించిన దుబ్బాక కాంగ్రెస్ ఇంచార్జ్ శ్రీనివాస్ రెడ్డి



( సీ కే న్యూస్ ) చేగుంట :నార్సింగ్ పట్టణంలో నార్సింగ్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఆకుల శ్రీనివాస్ గౌడ్ ఇటీవలే ప్రమాదవశాత్తు మరణించిన విషయం తెలుసుకొని వారి దశదిన కర్మ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించిన మన ప్రియతమ నాయకులు దుబ్బాక నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి చెరుకు శ్రీనివాస్ రెడ్డి . మరియు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు నాయకులులి కార్యకర్తలు గ్రామ ప్రజలు పాల్గొన్నారు

# గణతంత్ర దినోత్సవ వేడుకలకు ఆన్ని ఏర్పాట్లు చేయాలి.

- జిల్లా కలెక్టర్ జితేష్ వి.పాటిల్.



సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్),జనవరి 21,గణతంత్ర దినోత్సవ వేడుకలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ జిల్లా అధికారులను ఆదేశించారు. మంగళవారం ఐ డి ఓ సి కార్యాలయం సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన రిపబ్లిక్ డే వేడుకలకు సంబంధించి సమావేశం లో మాట్లాడుతూ ప్రగతి మైదానంలో ఆన్ని ఏర్పాట్లు చేయాలని అన్నారు. స్టేజి ఏర్పాట్లు తో పాటు విద్యా శాఖ ద్వారా కల్చరల్ ప్రోగ్రామ్స్ నిరంతర విద్యుత్ తో పాటు త్రాగునీరు, సౌండ్ ప్రూఫ్ జనరేటర్ ను అందుబాటులో ఉంచాలని అదే విదంగా బారికేటింగ్ పటిష్టంగా చేపట్టాలని అలాగే ఎంట్రీ, ఎగ్జిట్ గేట్స్ వద్ద వచ్చే అతిధులు, ప్రజలు ఇబ్బందులు పడకుండా పటిష్ట చర్యలు చేపట్టాలని పిల్లల సంస్కృతిక ప్రదర్శనలు, పోలీస్ గౌరవందనం సమయా పాలన ఉండాలని సూచించారు. అదేవిదంగా అంబులెన్సు, అగ్ని మాపాక సిబ్బంది అందుబాటులో ఉండాలని, గట్టి పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలని అన్నారు.

ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ డి. వేణుగోపాల్ , స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన , వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# వసతి గృహాలను ఆకస్మిక తనికి నిర్వహించిన న్యాయమూర్తి జి.భానుమతి.



సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్ ),జనవరి 21,

జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి జి.భానుమతి మంగళవారం కొత్తగూడెం లోని నాలుగు వసతి గృహాలను ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. కళాశాల బాలికల వసతి గృహము ఏ పవర్ హౌస్ బస్తీ, పోస్ట్ మెట్రిక్ గర్ల్స్ హాస్టల్ ఏ పవర్ ఆఫ్ బస్తి, సింగరేణి ఉమెన్స్ కాలేజీ ఎదురుగా ఉన్న బీసీ బాలికల వసతి గృహము, ప్రభుత్వ గిరిజన బాలికల వసతి గృహముల ను ఆకస్మిక తనిఖీ చేసి విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలపై ఆరా తీశారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన సదుపాయాలు కల్పించాలని వార్డెన్స్ కు ఆదేశించారు. ఈ సందర్భంగ వసతి గృహం లోని తరగతి గదులు, కిచెన్ రూం, స్టోర్ రూమ్ లను న్యాయమూర్తి పరిశీలించారు. పారిశు ధ్యం పై ప్రత్యేక చర్యలు తీసుకోవాలని హాస్టల్ సిబ్బందిని ఆదేశించారు. విద్యార్థులకు అందిస్తున్న ఆహర మెనూ ను పరిశీలించి నాణ్యమైన ఆహారాన్ని విద్యార్థులకు అందించాలని హాస్టల్ వార్డెన్ కు తెలిపారు. ఈ నాలుగు హాస్టల్స్ లలో ఆహారపు మెనును, సమయపాలన పాటించని సిబ్బంది పట్ల న్యాయమూర్తి అసహనం వ్యక్తం చేసారు. న్యాయమూర్తి తో పాటు డిప్యూటీ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ పి.నిరంజన్ రావు, సీనియర్ న్యాయవాది మెందు రాజమల్లు తనిఖీ లో పాల్గొన్నారు.

# అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందుతాయి..

- సంక్షేమ పథకాల అమలు నిరంతర ప్రక్రియ...
- ప్రభుత్వ పథకాలు ఇప్పిస్తామని చెప్పే దళారులను నమ్మకండి..
- ఇటుక బట్టీలు బ్రిక్స్ కంపెనీలు ఇతర కమర్షియల్ భూములకు, రైతు భరోసా వర్తించదు..
- వలస ఆదివాసీలకు విద్యా వైద్యం ఉపాధి అవకాశాలు కల్పిస్తాం.
- మద్దుకూరు గ్రామసభలో జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్.



సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్),జనవరి 21,సంక్షేమ పథకాల అమలు నిరంతర ప్రక్రియగా కొనసాగుతుందని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ స్పష్టం చేశారు. మంగళవారం చంద్రుగొండ మండలం మద్దుకూరు గ్రామంలో నిర్వహిస్తున్న గ్రామ సభలలో కలెక్టర్ పాల్గొని ప్రజలకు, అధికారులకు పలు సూచనలు చేసారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 26 నుండి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేయనున్న రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, ఆహార భద్రత (రేషన్) కార్డులు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాల గురించి గ్రామస్తులకు వివరించారు. ఈ పథకాల కింద అర్హులను గుర్తించేందుకు వీలుగా క్షేత్రస్థాయి పరిశీలన నిర్వహించడం జరిగిందని గుర్తు చేశారు.

ముఖ్యంగా సాగుకు యోగ్యమైన భూములను పక్కాగా నిర్ధారించామని అన్నారు. పంటలు సాగు చేస్తున్న ప్రతి రైతుకు ప్రభుత్వం రైతు భరోసా పథకం కింద ఎకరానికి 12 వేల రూపాయల చొప్పున పెట్టుబడి సాయం అందిస్తుందని తెలిపారు. ఇటుక బట్టీలు బ్రిక్స్ తయారీ కంపెనీలు, ఇతర కమర్షియల్ భూములకు రైతు భరోసా వర్తించదని ఆయన తెలిపారు. ఎవరైతే తిరిగి మళ్లీ ఆ భూముల్లో వ్యవసాయం చేస్తారో అప్పుడు వారికి కూడా రైతు భరోసా కల్పిస్తామన్నారు.అదే విధంగా సాగు భూమి లేని వ్యవసాయ కూలీ కుటుంబాలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కింద రెండు విడతల్లో 12 వేల రూపాయలు అందించడం జరుగుతుందన్నారు. ఎలాంటి సాగు భూమి లేకుండా కనీసం 20 రోజులు ఉపాధి హామీ పథకంలో పని చేసిన కుటుంబాలను అర్హులుగా గుర్తించామన్నారు. కొత్త రేషన్ కార్డుల కోసం వచ్చిన దరఖాస్తులను సమగ్ర పరిశీలన జరిపి ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా అర్హులను నిర్ధారించామని తెలిపారు. ఈ మేరకు వివిధ పథకాల ద్వారా అర్హులుగా గుర్తించబడిన వారి వివరాలను గ్రామ సభలో అందరి సమక్షంలో చదివి వినిపించారు. రేషన్ కార్డుల జారీ, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా తదితర పథకాల కోసం అర్హత కలిగిన వారు ఎప్పుడైనా దరఖాస్తు చేసుకోవచ్చని ఈ సందర్భంగా కలెక్టర్ సూచించారు.

ఆయా పథకాల కింద ఇప్పటివరకు దరఖాస్తులు చేసుకోని వారితో పాటు, అర్హత కలిగి లబ్ధిదారుల జాబితాలో పేర్లు లేని వారి నుండి కూడా అర్జీలు స్వీకరించారు. వాటిని సమగ్రంగా పరిశీలించి, అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి చేకూర్చడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. ఈ విషయంలో ప్రజలు ఎలాంటి అపోహలు, అనవసర ఆందోళనకు గురి కావాల్సిన అవసరం లేదని అన్నారు. గ్రామ సభలలో దరఖాస్తులు అందజేయ వచ్చని, వీలుపడని వారు ఈ నెల 26 తరువాత ఎప్పుడైనా మండల కార్యాలయాల లోని ప్రజా పాలన సేవా కేంద్రాలకు వెళ్లి సంబంధిత పత్రాలను జాతచేస్తూ దరఖాస్తులు చేసుకోవచ్చని సూచించారు. వచ్చిన ప్రతి దరఖాస్తును తప్పనిసరిగా పరిశీలించి అర్హులందరికీ సంక్షేమ పథకాలను వర్తింపజేస్తామని కలెక్టర్ భరోసా కల్పించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు ఇప్పిస్తామని వచ్చే దళారులను నమ్మి మోసపోవద్దని కలెక్టర్ అన్నారు. వలస ఆదివాసీల అభివృద్ధి కోసం విద్యా వైద్యం ఉపాధి అవకాశాలను కల్పిస్తామన్నారు. ఆదివాసీలు పోడు పేరుతో అడవులు నరక వద్దని, నరికిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు.

ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యాచందన, తాసిల్దార్ బి.సంధ్యారాణి, ఎంపీడీవో బి. అశోక్, సొసైటీ వైస్ చైర్మన్ నల్లమోతు వెంకటనారాయణ, ఇందిరమ్మ కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

# గుర్తింపు లేని మల్టీ లెవెల్ మార్కెటింగ్ కంపెనీల మోసాల బారిన పడకండి.



- అప్రమత్తతే ఆయుధం.. సైబర్ నేరాల బారినపడి మోసపోకుండా జిల్లా ప్రజలు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలి.
- ఎస్పీ రోహిత్ రాజు.

సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, (సాయి కౌశిక్ ),జనవరి 21,మల్టీ లెవెల్ మార్కెటింగ్ మోసాలపై అలర్ట్ గా ఉండాలని జిల్లా ఎస్పీ రోహిత్ రాజు జిల్లా ప్రజలకు విజ్ఞప్తి చేశారు. వ్యవసాయ ఉత్పత్తులు, హెర్బల్, హెల్త్ కేర్, ఇతర గృహోపకరణాల మార్కెటింగ్ పేరు తో కొత్త తరహా మోసాలు జరుగుతున్నాయని జిల్లా ఎస్పీ మంగళవారం రోజున ఒక ప్రకటనను విడుదల చేశారు.తక్కువ సమయం లో ఎక్కువ లాభాలు ఇస్తామని మళ్లీ మల్టీ లెవెల్ మార్కెటింగ్ (పిరమిడ్ మోసాలు) మళ్ళీ ప్రారంభమయ్యాయని అన్నారు. గొలుసుకట్టుగా అమాయకులను వల వేసి మోసం చేస్తున్నారని హెచ్చరిస్తున్నారు. ఇటీవల కాలంలో రాష్ట్రంలోని కొన్ని జిల్లాల్లో ఈ విధమైన మోసాలకు కొంతమంది వ్యక్తులు పాల్పడుతున్నారని,అలాంటి వారి పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు.ఈ తరహా మోసాల బారిన పడకుండా ప్రజలు ఎప్పటికప్పుడు అప్రమత్తతతో వ్యవహరించాలని కోరారు. విలాసవంతమైన వస్తువులిస్తామని, ప్లాట్లు రిజిస్ట్రేషన్ చేస్తామని, విదేశీ యాత్రలకు పంపుతామని, రకరకాల మాయమాటలతో ఆఫర్లు పెట్టి,ప్రజల నుండి మొదటగా సభ్యత్వాలను స్వీకరించి,వారితో మరికొంత మందిని సభ్యులుగా చేర్పించే ప్రయత్నం చేస్తూ ఎంత ఎక్కువ మందిని సభ్యులుగా చేర్పిస్తే అంత అధిక మొత్తంలో డబ్బులు తిరిగొస్తాయని నమ్మించి ప్రజల్ని మభ్యపెట్టే కొత్త కొత్త టెక్నిక్ లతో సైబర్ నేరగాళ్లు మార్కెట్లోకి వస్తున్నారు. ఇలాంటి స్కీం లలో తొలుత చేరిన తక్కువ మందికి లాభాలు చూపించి, మిగిలిన అందరి సొమ్ము కొల్లగొడతారని తెలిపారు.ఇలాంటి నూతన స్కీం ల పట్ల, నేరగాళ్ల పట్ల ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాల్సిన అవసరముంది. మనకు ఎటువంటి సంబంధం లేని వాళ్ళు మనకు ఏ విధమైన ఆర్థిక ప్రయోజనం ఊరికే చెయ్యరనే విషయాన్ని గ్రహించాలని తెలిపారు.మనల్ని నమ్మించి,మభ్యపెట్టి, వంచించి మన దగ్గరి,మన ద్వారా మరికొందరి కష్టార్జితాన్ని కొల్ల గొట్టడమే మోసగాళ్ల పని అని తెలిపారు.

కాబట్టి ఇలాంటి నేరాల పట్ల మొబైల్ ఫోన్లను చూసే మనకు ఫేస్ బుక్ ,వాట్సాప్, టెలిగ్రామ్, ఇన్స్టాగ్రామ్, యూట్యూబ్, ఈ-మెయిల్, ఫోన్ కాల్ ల ద్వారా మీ దృష్టిని ఆకర్షించే ఇటువంటి కుట్రలకు ఎట్టిపరిస్థితుల్లో లొంగవద్దని తెలుప్పారు.తొందరపడి బాధలను, నష్టాలను కొని తెచ్చుకోవద్దన్నారు.ఒకవేళ మీరు అన్ని జాగ్రత్తలను తీసుకున్నా కూడా మోసపోయిన పక్షంలో ఒక్క క్షణం కూడా ఆలస్యం చెయ్యకుండా 1930 టోల్ ఫ్రీ నంబర్ కి గానీ, www.cybercrime.gov.in ద్వారా కానీ లేదా మీ సమీప పోలీస్ స్టేషన్ లో నైనా వెంటనే పూర్తి వివరాలతో ఫిర్యాదు చెయ్యాలని సూచించారు.సైబర్ మోసాల బారిన పడిన బాధితులు ఎంత త్వరగా ఫిర్యాదు చేయగలిగితే అంత త్వరగా వారు కోల్పోయిన నగదును తిరిగి పొందవచ్చని తెలిపారు.

# ఇల్లెందు, టేకులపల్లిలో ప్రారంభమైన గ్రామసభలు



సి కే న్యూస్ ఇల్లందు నియోజకవర్గ ప్రతినిధి,జనవరి 21,

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న గ్రామ సభలు ఇల్లందు, టేకులపల్లి మండలాలతో పాటు ఇల్లందు మున్సిపాలిటీలో మంగళవారం ప్రారంభమయ్యాయి. మండలాల్లో ఎంఈడీఓ, తహశీల్దార్, ఎంపీఓ, ఎంఏఓ లతో నాలుగు టీములు ఏర్పాటు చేశారు. ఇల్లందు 29 పంచాయతీలు, టేకులపల్లిలో 36 పంచాయితీలు ఉండగా, మున్సిపాలిటీలో 24 వార్డుల్లో గ్రామ సభలు నిర్వహితున్నారు. టేకులపల్లి మండలంలో 21న ఎంపీడీఓ టీమ్ ముత్యాలంపాడు క్రాస్ రోడ్, రాంపురం, చుకాలబోడు, తహశీల్దార్ టీమ్ రాళ్ళపాడు, పెత్రంచెలక, ఎంపీఓ టీమ్ కుంటాల, ఎర్రాయిగూడెం, ఎంఏఓ టీమ్ మొక్కంపాడు, బర్లగూడెం పంచాయతీల్లో గ్రామసభలు నిర్వహించారు. కొన్ని చోట్ల లబ్ధిదారుల ఎంపికలు ఏకపక్షంగా చేస్తున్నారని ఆరోపించగా అధికారులు దానిని ఖండిస్తున్నారు. అవసరమైతే మరోమారు విచారణ చేస్తామంటున్నారు. టేకులపల్లి మండలంలో జరిగిన కార్యక్రమాల్లో ఎంపీడీఓ రవీందర్ రావు, తహశీల్ధార్ నాగభవాని, ఎంపీఓ గాంధీ, ఎంఏఓ అన్నపూర్ణాలతో పాటు, జిల్లా, నియోజకవర్గ స్థాయి అధికారులు పాల్గొన్నారు.

# భీమిలి హైస్కూల్ శతాబ్ది ఉత్సవాలను వేడుకలా నిర్వహిద్దాం

- భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు
- యంత్రాంగం తరఫున పూర్తి సహకారం అందిస్తాం జిల్లా కలెక్టర్

సి కె న్యూస్ విశాఖపట్టణం ప్రతినిధి ( రవికుమార్ ) జనవరి 21 : భీమిలి హైస్కూల్ శతాబ్ది ఉత్సవాలను పండుగ వాతావరణంలో ఘనంగా నిర్వహించాలని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం హైస్కూల్లో జరిగిన సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా వందేళ్లు పూర్తి చేసుకున్న హైస్కూళ్లు అరుదుగా ఉంటాయని, వాటి సరసన భీమిలి హైస్కూల్ చేరడం గర్వకారణమని పేర్కొన్నారు. శతాబ్ది ఉత్సవాలను ఆశీర్వదిస్తూ, సావనీర్ కోసం ప్రధాని నరేంద్ర మోదీ ప్రత్యేక సందేశం పంపారని వెల్లడించారు. ఫిబ్రవరి 1, 2 తేదీల్లో రెండు రోజుల పాటు జరగబోయే ఈ కార్యక్రమానికి విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ ను ముఖ్యఅతిథిగా ఆహ్వానించనున్నామని తెలిపారు. సమయాభావాన్ని దృష్టిలో ఉంచుకుని హైస్కూల్ సుందరీకరణ పనులు యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలని అధికారులకు, పూర్వ విద్యార్థుల సంఘానికి సూచించారు. హైస్కూల్ లో టాయ్ లెట్లు, తరగతి గదులు, అసంపూర్తి భవనాల నిర్మాణం తదితర పనులకయ్యే నిధులను సమకూర్చడానికి తన మిత్రులు ముందుకు వచ్చారని, ఉత్సవాల సమయంలో ఆ పనులకు శంకుస్థాపన చేసి సాధ్యమైనంత త్వరగా పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. హైస్కూల్ పూర్వ విద్యార్థుల సంఘాన్ని విస్తృతం చేయడం ద్వారా అనేక అభివృద్ధి పనులు చేసుకోవచ్చని తెలిపారు. తాను విద్యాశాఖ మంత్రిగా ఉన్నప్పుడు శ్రీకారం చుట్టిన ఆంధ్రా యూనివర్సిటీ పూర్వ విద్యార్థుల సంఘం డేటా బేస్ లో ప్రస్తుతం 2 లక్షల మంది వివరాలు ఉన్నాయన్నారు. అనుకున్న సమయానికి పైలాన్ సహా ఏర్పాట్లన్నీ పూర్తి చేయాలని కోరారు.యంత్రాంగం తరఫున పూర్తి సహకారం అందిస్తాం జిల్లా కలెక్టర్ జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ మాట్లాడుతూ ప్రభుత్వం తరపున పూర్తి సహాయ సహకారాలు అందించి శతాబ్ది ఉత్సవాలను విజయవంతంగా నిర్వహిస్తామని తెలిపారు. స్థానిక అధికారులంతా పూర్తి సహకారం అందించాలని ఈ సందర్భంగా సూచించారు. పచ్చదనం పెంపుదలకు, పరిసరాల శుభ్రతకు అధిక ప్రాధాన్యత ఇచ్చి సుందరీకరణ చేపట్టాలని, వచ్చే పది రోజుల్లో స్కూల్ రూపరేఖలు మారిపోవాలని అక్కడి అధికారులకు నిర్దేశించారు. భీమిలి హైస్కూల్ శతాబ్ది ఉత్సవాల నిర్వహణ గురించి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు చొరవ తీసుకొని తనతో చర్చిస్తున్నారని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు. అందరూ సమన్వయంతో వ్యవహరించాలని, భీమిలి గర్వపడేలా ఏర్పాట్లు చేయాలని, విద్యా సంబంధిత ఫలితాలు మరిన్ని వచ్చేలా కృషి చేయాలని సూచించారు. పూర్తి స్థాయి సన్నద్ధతా ఏర్పాట్లపై కలెక్టరేట్లో సమీక్షా సమావేశం నిర్వహిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో భాగంగా భీమిలి హైస్కూల్ శతాబ్ది ఉత్సవాల లోగోను ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్, ఇతర అధికారులు, ప్రజా ప్రతినిధులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో డి.ఈ.ఓ. ప్రేమ్ కుమార్, జోనల్ కమిషనర్ ప్రేమ ప్రసన్నవాణి, పూర్వ విద్యార్థుల సంఘం ప్రతినిధులు అప్పలనాయుడు, పార్వతీశం, షణ్ముఖరావు, లక్ష్మణరావు, పి.శ్రీనివాస్, బసవ కృష్ణమూర్తి, జెడ్పీటీసీ గాడు వెంకటప్పడు, కార్పొరేటర్ అప్పలకొండ, గంటా నూకరాజు పాల్గొన్నారు.



# ప్రగతి పథం.. సకల జనహితం.. మన ప్రజా ప్రభుత్వం.

ప్రజా పాలన గ్రామ సభలో పాల్గొన్న సయ్యద్ ఇక్బాల్ హుస్సేన్..



సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్),జనవరి 21,కరకగూడెం మండలంలోని, కన్నాయిగూడెం, చోప్పాలా, కొత్తగూడెం గ్రామ పంచాయతీలలో పినపాక నియోజకవర్గ శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు ఆదేశాల మేరకు తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన ప్రజా పాలన దరఖాస్తు స్వీకరణ గ్రామ సభలను సందర్శించిన కాంగ్రెస్ పార్టీ కరకగూడెం మండల అధ్యక్షులు సయ్యద్ ఇక్బాల్ హుస్సేన్..

ఈ కార్యక్రమంలో మండల కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షులు నాగ బండి వెంకటేశ్వర్లు, కార్యకర్తలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు..

# నాగుల జ్యోతికి జ్యోతి బాపూలే రాష్ట్ర స్థాయి "మహిళా ప్రతిభ"పురస్కారం.

**అభినందించిన ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు.**



**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్),జనవరి 21,**మణుగూరు ఏరియా సామాజిక కార్యకర్త నాగుల జ్యోతికి జ్యోతి బాపూలే రాష్ట్ర స్థాయి "మహిళా ప్రతిభ"పురస్కారం అందుకున్న సందర్భంగా అభినందించిన ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు. జ్యోతి వెలుగుకు చిహ్నం అయితే నాగుల జ్యోతి సామాజిక సేవకు అంకితం అని ఆమె సేవలు స్ఫూర్తి దాయకమని పినపాక నియోజకవర్గం శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు అభినందించారు. మంగళవారం మణుగూరు ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో బంధు మిత్రులు కాంగ్రెస్ కార్యకర్తల నడుమ జరిగిన జ్యోతి అభినందన సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. మణుగూరు పద్మ గూడెం బీసీ కాలనీకి చెందిన నాగుల జ్యోతి సత్యార్థి ఫౌండేషన్ వారు నిర్వహిస్తున్న యాక్షన్ ఫర్ ఇంటిగ్రేటెడ్ డెవలప్మెంట్ ప్రాజెక్టులో సామాజిక కార్యకర్తగా బాల్య వివాహాల వ్యతిరేక, సామాజిక కార్యకర్తగా ప్రజల్లో అవగాహన పెంచుతూ అధికారుల ప్రజల ప్రశంసలు అందుకుంటుందని రాష్ట్ర ప్రభుత్వ మరియు బీసీ సంక్షేమ శాఖ సంయుక్త నిర్వహణలో ఆమె జ్యోతి బాపూలే రాష్ట్ర స్థాయి మహిళ ప్రతిభ అవార్డుకపోవడం అభినందనీయమని ఈ సందర్భంగా జ్యోతి సేవలను ఆయన కొనియాడారు. ఇదే స్ఫూర్తితో మునుముందు ప్రజలకు మరింత చేరువ కావాలని మరిన్ని అవార్డులు రివార్డులు అందుకోవాలని ఆయన ఆకాంక్షించారు. ఈ సందర్భంగా శాలువా పుష్పగుచ్ఛం జ్ఞాపిక తో ఆమెను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమం లో సింగరేణి సేవా సమితి సభ్యులు యస్ డి నా సర్ పాషా, ఐ ఎన్ టి యు సి నాయకులు వత్సవాయి కృష్ణంరాజు, పిరినాకి నవీన్,బల్లెం సురేష్,పూనెం శేఖర్, సామాజిక కార్యకర్త అంగోత్ మంగీలాల్, ఐ ఎఫ్ టి యు నాయకులు నల్లార్ రమేష్, కాంగ్రెస్ పార్టీ నాయకులు సుబ్బారెడ్డి, జీవరత్నం, గణేష్ రెడ్డి,పద్మ గూడెం గ్రామ పెద్ద పద్దం నాగేశ్వరరావు, జ్యోతి బంధువులు నాగుల ఎల్లయ్య మల్లికాంబ సుధాకర్, సురేష్, నాగుల సుధా, మమత, కృషి , యశ్విని, శాన్విక, భవిత కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ప్రగతిశీల యువజన సంఘం పి వై ఎల్ నూతన జిల్లా కమిటీ ఎన్నిక

- భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కమిటీ సభ్యులు గా తోటకూరి సతీష్



**సి కే న్యూస్ ఇల్లందు నియోజకవర్గ ప్రతినిధి,జనవరి 21,** ప్రగతిశీల యువజన సంఘం పి వై ఎల్ రెండు జిల్లా కమిటీ లు మంగళవారం ఇల్లందు ఐ ఎఫ్ టీ యూ ఆఫీస్ లో జరిగిన ఉమ్మడి సమావేశం లో ఇప్పటి వరకు రెండు కమిటీలు గా పని చేసిన కమిటీలను ఒకటి గా ఐక్యత చేయడం జరిగింది అనంతరం నూతన జిల్లా కమిటీ ని 21 మంది తో ఏర్పాటు చేయడం జరిగింది. ఈ నూతన కమిటీ లోకి టేకులపల్లి మండల కార్యదర్శి గా పని చేస్తున్న తోటకూరి. సతీష్ ని ఎన్నుకోవడం జరిగింది అని ప్రగతిశీల యువజన సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు మోకాళ్ళ రమేష్ తెలిపారు.

## మైనింగ్ సూపర్వైజర్ల బదిలీలను నిలిపివేయాలి.

- జెంఈటిల ప్రమోషన్లలో జరిగే అన్యాయాన్ని సరిచేయాలి.
- గత గుర్తింపు సంఘం అవగాహన లోపంతోనే ప్రమోషన్లలో అన్యాయం.
- సింగరేణి గుర్తింపు సంఘం నేతలు సీతారామయ్య, రాజ్ కుమార్.
- సింగరేణి ఉన్నతాధికారులతో చర్చించిన గుర్తింపు సంఘం నేతలు.



**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్),జనవరి 21,** కొత్తగూడెం ఏరియాలో పనిచేస్తున్న మైనింగ్ సూపర్వైజర్ సిబ్బందిని బదిలీలను నిలుపుదల చేసి త్వరలో ప్రారంభం కానున్న వికె-7 ఓపెన్ క్యాస్టులో సర్దుబాటు చేయాలని గుర్తింపు సంఘం సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) కేంద్రకమిటీ అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య, ప్రధాన కార్యదర్శి కోరిమి రాజ్ కుమార్ డిమాండ్ చేశారు. సింగరేణి జనరల్ మేనేజర్ (ఐఆర్)ను యూనియన్ ప్రతినిధు బృందం వినతిపత్రం అందించి సమస్యలను అధికారికి వివరించారు. చర్చల అనంతరం నాయకులు మాట్లాడుతూ 2016లో అప్పటి గుర్తింపు సంఘం చేసిన తప్పుడు ఒప్పందం తో జెఎంఈటిల ప్రమోషన్లలో అన్యాయం జరుగుతోందని, వీరు చేసిన ప్రమోషన్స్ ఒప్పందం కొందరికె ఉపయోగపడిందని, ప్రతి ఒక్కరికి బి గ్రేడ్ అవర్మేన్లుగా ప్రమోషన్స్ ఇవ్వాలని కోరామన్నారు. గతంలో బదిలీపై వచ్చిన వారిని మరల కౌన్సిలింగ్ నిర్వహించి బదిలీ చేయడం వలన వారి కుటుంబాలు ఇబ్బందులకు గురవుతున్నారని ఈ సమస్యకు పరిస్కారం చూపాలన్నారు. వెబ్ కౌన్సిలింగ్ ద్వారా ఇతర ప్రాంతాలకు బదిలీపై వెళ్లిన మైనింగ్ సిబ్బందికి సెటిలింగ్ అలవెన్సు మంజూరు చేయాలనీ కోరామని తెలిపారు. వినతిపత్రం అందించిన వారిలో వంగ వెంకట్, వట్టికొండ మల్లికార్జునరావు, రమణమూర్తి, రాంగోపాల్, కిష్టొఫర్, సాయి పవన్, దార శివ తదితరులు ఉన్నారు.

## ఆదివాసి గిరిజన గ్రామాలలో క్షయ వ్యాధి పై అవగాహన



**సి కే న్యూస్ ఇల్లందు నియోజకవర్గ ప్రతినిధి,జనవరి 21,**భారతదేశంలో ప్రజల సామాజిక ఆర్థిక స్థితిగతులను తీవ్రంగా ప్రభావితం చేస్తున్న క్షయ వ్యాధిని పూర్తిగా నిర్మూలించడానికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త భాగస్వామ్యంలో నిర్వహిస్తున్న 100 రోజుల ముమ్మర కృషి కార్యక్రమం నిక్షయ్ షివిర్ లో భాగంగా మంగళవారం సులానగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి డాక్టర్ కందుల దినేష్ ఆధ్వర్యంలో ఆయుష్మాన్ ఆరోగ్యమందిర్ బద్దు తండా ఆరోగ్య ఉప కేంద్రం పరిధిలోని బద్దు తండా, నంద్యాతండా, మద్దిరాల గుంపు , అబ్బిరెడ్డిగూడెం, తుమ్మలచెలక, అందుగులగూడెం ,కుంటల్ల ,ఆదివాసి గిరిజన గ్రామాల ప్రజలకు క్షయ వ్యాధి పై పూర్తి అవగాహన కల్పించి అనుమానితులను పరీక్షించి వ్యాధి నిర్ధారణ చేయడానికి ఇక్కడే ఖరీదైన డిజిటల్ ఎక్సరే పరీక్షలు చేసి సి బి నాట్ పరీక్ష కొరకు తెమడ శాంపిల్ సేకరణ కార్యక్రమం జరిగింది ఈ కార్యక్రమాన్ని ప్రపంచ ఆరోగ్య సంస్థ క్షయ నివారణ విభాగ అధికారి డాక్టర్ విష్ణు జిల్లా క్షయ నివారణాధికారి డాక్టర్ బాలాజీ నాయక్ తో కలిసి కార్యక్రమం జరుగుతున్న తీరుతెన్నులను పరిశీలించారు దేశవ్యాప్తంగా ఎంపిక చేసిన క్షయ వ్యాధి తీవ్రంగా ఉన్న 347 జిల్లాల్లో తెలంగాణ రాష్ట్రంలో తొమ్మిది జిల్లాలు ఉన్నాయని అందులో మన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఒకటి అని కాబట్టి క్షయ వ్యాధిపై సమాజంలోని ప్రతి ఒక్కరూ చర్చించుకుని అవగాహన పెంచుకొని దానిని పూర్తిగా నిర్మూలించడంలో సహకరించాలని ఈ సందర్భంగా కోరారు లేనిచో క్షయ వ్యాధి బారిన పడి మరణం పొందిన జాబితాలో మనతోపాటు మన కుటుంబ సభ్యులు కూడా ఉండే అవకాశం ఉందని హెచ్చరిస్తూ వ్యాధి లక్షణాలు అయిన 15 రోజులకు మించి దగ్గు, జ్వరం ఆకలి లేకపోవడం బరువు తగ్గిపోవడం, ఆయాసం, అలసట, తెమడలో రక్తం పడటం , మెడ చుట్టూ చంకలో గజ్జల్లో గడ్డలు వంటి ప్రధాన లక్షణాలు ఉన్నవారు గతంలో క్షయ వ్యాధికి మందుల వాడిన వారు మరియు వారి కుటుంబ సభ్యులు దీర్ఘకాలిక వ్యాధులకు మందులు వాడుతున్న వారు 60 సంవత్సరాలు పైబడిన వారు ఈ వందరోజుల నిక్షయ్ షివిర్ కార్యక్రమంలో పాల్గొని ఉచిత క్షయ వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయించుకుని నిర్ధారణ జరిగితే ప్రభుత్వం ఇచ్చే నాణ్యమైన మందులతో వ్యాధిని తగ్గించుకొని తద్వారా మరణాన్ని నివారించుకోవడంతోపాటు కుటుంబ సభ్యులకు మరియు సమాజంలోని ఇతరులకు క్షయ వ్యాధి వ్యాప్తిని నివారించవచ్చని తద్వారా ఈ వ్యాప్తిని భారత సమాజం నుంచి పూర్తిగా నిర్మూలించడం సాధ్యపడుతుందని అన్నారు అలాగే ప్రభుత్వ ఆసుపత్రిలో క్షయ వ్యాధికి మందులు వాడే ప్రతి వ్యాధిగ్రస్తుడికి వ్యాధి తగ్గేవరకు నిరంతర సూచనలు సలహాలు ఇవ్వడంతో పాటు పోషకాహార నిమిత్తం మందులు వాడే కాలానికి ప్రతి నెల 1000 రూపాయలు పేషంట్ బ్యాంక్ ఖాతా లో వేయడం జరుగుతుంది అని పై సౌకర్యాలు ప్రైవేట్ దవాఖానాలో లభించవు మరియు చాలా ఖర్చుతో కూడుకున్నవి కాబట్టి ప్రభుత్వ వైద్యశాలలో లభించే పై ఉచిత సేవలను ఉపయోగించుకొని క్షయ వ్యాధిని అంతమొందించడంలో ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు ఈ కార్యక్రమంలో వైద్యాధికారి వెంకటేష్, రేడియాలజిస్ట్ లహరి, టీబి అలర్ట్ ఇండియా నుండి వెంకటేశ్వర్లు ,కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ వజ్జా పార్వతి ,పబ్లిక్ హెల్త్ నర్స్ ఆఫీసర్ చంద్రకళ, సూపర్వైజర్లు గుజ్జ విజయ ,కౌసల్య సింగ్ , పోరండ్ల శ్రీనివాస్, నాగుబండి వెంకటేశ్వర్లు ,మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్ ధరణి, ఏఎన్ఎం స్వప్న, క్షయ వ్యాధి నివారణ ఇల్లందు డివిజన్ అధికారులు కృష్ణవేణి ,శిరీషా ,శంకర్ ,సర్వన్ పాల్గొన్నారు.

## వెంకటేశ్వర కాలనీ గ్రామ సభను బహిష్కరించిన ప్రజలు.



**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్),జనవరి 21,** వెంకటేశ్వర కాలనీ గ్రామ పంచాయతీలో ప్రభుత్వ నిర్వహించిన గ్రామ సభను అక్కడి ప్రజలు బహిష్కరించారు. అక్కడ ప్రజలు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో ఇళ్ల కేటాయింపులో 1/70 లో ఉన్న మాకు ఇక్కడ ఇల్లు కట్టుకోవడానికి అర్హత లేదని చెప్పి అప్పటి ప్రభుత్వం మాకు ఇల్లు మంజూరు చేయలేదు. ఒకవేళ డబ్బులు పెట్టుకొని స్థలం కొనుక్కొని ఇల్లు కట్టుకుందాం అంటే ప్రభుత్వ అధికారులు వచ్చి నోటీసు ఇచ్చి ఇల్లు కట్టుకోవడానికి పర్మిషన్ లేదని చెప్పి ఇంటి నెంబర్ గాని కరెంట్ మీటర్ గాని ఇవ్వడం లేదు. ఇప్పుడు మరలా ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల పేర్లలో నాన్ ట్రైబ్ ఉండడం ఆశ్చర్యానికి గురి చేస్తుందని చెప్పి వారు అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం మా గురించి ఆలోచించి గత ప్రభుత్వం చేసిన విధంగా కాకుండా పకడ్బందీగా ఇందిరమ్మ ఇల్లు నాన్ ట్రైబ్ అయిన మాకు కూడా కేటాయించాలి అప్పటివరకు ఇక్కడ గ్రామసభ నిర్వహించ వద్దని చెప్పి వెంకటేశ్వర కాలనీ గ్రామ ప్రజలు గ్రామ సభను బహిష్కరించారు. ఇట్టి విషయంలో అధికారులు స్పందిస్తూ మీరు చెప్పిన సమస్యని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారం అయ్యే దిశగా చర్యలు తీసుకుంటామని చెప్పి హామీ ఇచ్చారు. మా సమస్యని కచ్చితంగా పరిష్కరించా కే గ్రామ సభ నిర్వహించాలని ప్రజలు తెలియజేశారు. 251 మంది దరఖాస్తు చేసుకుంటే దాన్లో 56 మందికే ఇల్లు మంజూరు చేయడం ఏంటని ప్రజలు నిలదీశారు మా గ్రామంలో అందరూ నిరుపేదలే ఉన్నారు అందులో చాలామందికి నివసించడానికి ఇల్లు కూడా లేవు అలాంటి మాకు 54 ఇల్లులు మంజూరు చేయడం చాలా దారుణమని వచ్చిన అధికారులను ప్రజలు నిలదీసి గ్రామ సభను బహిష్కరించారు.

## అధికారుల నిలదీసిన మున్సిపల్ చైర్ పర్సన్ కాపు సీతాలక్ష్మి..




**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్),జనవరి 21,** టిఆర్ఎస్ హయాంలో సబ్బండవర్ణాల ప్రజలకు సంక్షేమ పథకాలను దరిచేరిస్తే... కాంగ్రెస్ కొందరికే సంక్షేమ పథకాలు అంటూ ప్రజల మధ్య చిచ్చు పెట్టి ప్రభుత్వ పలలను దూరం చేస్తున్నారు. ప్రభుత్వ భూమి అమ్మకానికి పెట్టీ రైతు భరోసా? ప్రజలకు ఇచ్చిన హామీలు, ఎన్నికల మ్యానిఫెస్ట్ అమలు చేయాలని ప్రజలు నిలదిస్తుంటే... ఒక్క హామీ అమలు చేయకుండా పక్కదారి పట్టించేందుకు.. సంక్షేమ పథకాలు అర్హుల గుర్తింపు అని ప్రజల మధ్య చిచ్చు పెట్టేందుకు చేసే కార్యక్రమం ఇది తప్పా ప్రజలకు ఉపయోగం ఏమి లేదు. ఎన్ని సార్లు రేషన్ కార్డుల కోసం వందలు వందలు ఖర్చులు చేసి జిరాక్సు తీపిచ్చే . ప్రజా పాలల్లో ఇచ్చిన దరఖాస్తులను ఏం చేశారు. ప్రజాపాలన దరఖాస్తులో ప్రజలు స్వీయ ధ్రువీకరణ తో ఇచ్చిన సమాచారం ఆధారంగా ప్రజలందరికీ సంక్షేమ పథకాలు అందించాలి కానీ అవి ఎక్కడో చెత్త బుట్టల వేసి ఈ విధంగా చేయడం సరికాదు అన్నారు. మున్సిపల్ చైర్ పర్సన్ కాపు సీతాలక్ష్మి కొత్తగూడెం..

## అన్నీ వర్గాల ప్రజల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం.

**రాష్ట్ర మార్క్ఫెడ్ డైరెక్టర్, డిసిఎంఎస్ చైర్మన్ కొత్వాల.**



**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్),జనవరి 21,**
తెలంగాణా రాష్ట్రంలోని అన్నీ వర్గాల ప్రజల సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పాలనా సాగిస్తున్నదని రాష్ట్ర మార్క్ఫెడ్ డైరెక్టర్, డిసిఎంఎస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు అన్నారు.

తెలంగాణా ప్రభుత్వం ఈ నెల 26 తేదీ నుండి అమలు చేయనున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం, రేషన్ కార్డులు, రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా లబ్ధిదారుల ఎంపికలి కోసం వార్డు సభలు చేపట్టడం జరిగింది. మొదటిరోజు మంగళవారం మున్సిపాలిటీ పరిధిలోని 1 వార్డు గడియకట్ట, 2 వార్డు పాత పాల్వంచ, 3 వార్డు నవభారత్, 4 వార్డు సీతారాం పట్నం, 5 వార్డు సబ్ స్టేషన్ ఏరియా, 6 వార్డు వడ్డుగూడెంలి ప్రాంతాల్లో జరిగిన వార్డు సభల్లో కొత్వాల పాల్గొన్నారు.


ఈ సందర్భంగా కొత్వాల మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మ్యానిఫెస్టోలో భాగంగా ఆరు గ్యారంటీల ను ప్రకటించిందని, వాటిలో ఒకే దఫా రెండు లక్షల రుణమాఫీ, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఉచిత విధ్యుత్ వంటి పథకాలను నిర్విఘ్నంగా అమలులి చేస్తున్నదన్నారు. ఇటీవల రైతు భరోసా, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాలను చేపట్టే విధంగా చర్యలు తీసుకుంటున్నారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాలను ప్రజలు ఆదరించాలని కొత్వాల కోరారు.

కొత్వాలను సన్మానించిన ఇందిరమ్మ కమిటీ సభ్యులు

వార్డు సభల సందర్భంగా ఆయా ప్రాంతాల మహిళలు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు కొత్వాల ను సన్మానించారు. ఈ కార్యక్రమాల్లో మున్సిపల్ కమీషనర్ కే సుజాత, మేనేజర్ సత్యనారాయణ, డి ఈ స్వరూపారాణి, ఎ ఈ రాము, టి పి ఓ నవీన్ కుమార్, మండల కాంగ్రెస్ అధ్యక్షులు కోండం వెంకన్న, పట్టణ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు పైడిపల్లి మహేష్, కాంగ్రెస్ ఆచార్యులు, కందుకూరి రాము, దారా చిరంజీవి, చింతా నాగరాజు, వాసుమల్ల సుందర్ రావు, డిష్ నాగేశ్వరరావు, అజిత్, వజ్జల రాము, మాలోత్ కోటి నాయక్, బాలు నాయక్‌లి, తదితరులు పాల్గొన్నారు.

## అన్నీ వర్గాల ప్రజల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం.

**కాంగ్రెస్ పార్టీ సీనియర్ జిల్లా నాయకులు తుమ్మల శ్రీనివాస్.**



**సికే న్యూస్ వలిగొండ మండలం ప్రతినిధి బాలరాజు జనవరి 21,**తెలంగాణా రాష్ట్రంలోని అన్నీ వర్గాల ప్రజల సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పాలనా సాగిస్తున్నదని.

తెలంగాణా ప్రభుత్వం ఈ నెల 26 తేదీ నుండి అమలు చేయనున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం, రేషన్ కార్డులు, రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా.

కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మ్యానిఫెస్టోలో భాగంగా ఆరు గ్యారంటీల ను ప్రకటించిందని, వాటిలో ఒకే దఫా రెండు లక్షల రుణమాఫీ, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఉచిత విధ్యుత్ వంటి పథకాలను నిర్విఘ్నంగా అమలులి చేస్తున్నదన్నారు. ఇటీవల రైతు భరోసా, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాలను చేపట్టే విధంగా చర్యలు తీసుకుంటున్నారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాలను ప్రజలు ఆదరించాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు తుమ్మల శ్రీనివాస్ కోరారు.

## ప్రజల సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పాలన కొనసాగిస్తుంది.

**కంచన పెల్లి గ్రామ శాఖ అధ్యక్షులు రేసు బుచ్చిరెడ్డి.**




**సికే న్యూస్ వలిగొండ మండలం ప్రతినిధి బాలరాజు జనవరి 21,** మీడియా ద్వారా మాట్లాడుతూ ,తెలంగాణా రాష్ట్రంలోని అన్నీ వర్గాల ప్రజల సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పాలనా సాగిస్తున్నదని. తెలంగాణా ప్రభుత్వం ఈ నెల 26 తేదీ నుండి అమలు చేయనున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం, రేషన్ కార్డులు, రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా.

కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మ్యానిఫెస్టోలో భాగంగా ఆరు గ్యారంటీల ను ప్రకటించిందని, వాటిలో ఒకే దఫా రెండు లక్షల రుణమాఫీ, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఉచిత విధ్యుత్ వంటి పథకాలను నిర్విఘ్నంగా అమలులి చేస్తున్నదన్నారు. ఇటీవల రైతు భరోసా, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాలను చేపట్టే విధంగా చర్యలు తీసుకుంటున్నారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాలను ప్రజలు ఆదరించాలని కంచనపల్లి గ్రామ శాఖ అధ్యక్షులు రేసు బుచ్చిరెడ్డి కోరారు.

## ఈ నెల 22న జరిగే ప్రగతిశీల యువజన సంఘం ఐక్యత సభ ను జయప్రదం చేయండి.

- నోములు. భానుచందర్ సహాయ కార్యదర్శి పి వై ఎల్ జిల్లా సహాయ కార్యదర్శి



**సి కే న్యూస్ ఇల్లందు నియోజకవర్గ ప్రతినిధి,జనవరి 21,**

ఈ నెల 22న యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు పట్టణం లో జరిగే రెండు ప్రగతిశీల యువజన సంఘంల విలీన ఐక్యత సభను జయప్రదం చేయాలని పి వై ఎల్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సహాయ కార్యదర్శి నోముల భానుచందర్ కోరారు. ఈ సందర్భంగా ప్రగతిశీల యువజన సంఘం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నాయకులు తోటకూరి సతీష్, జిల్లా సహాయ కార్యదర్శి నోముల భానుచందర్ మాట్లాడుతూ సామ్రాజ్యవాద విష సంస్కృతి కి వ్యతిరేకంగా పోరాడుతున్న రెండు సంఘాలు వేర్వేరు నిర్మాణాలు కలిసి ఉండడం వల్ల బలమైన యువజనోద్యమాన్ని నిర్మించలేక పోతున్నాం. కాబట్టి రెండు రాష్ట్ర కార్యవర్గలు చర్చించుకుని జనవరి 22 న ఆలేరు లో విలీన ఐక్యత సభ ఏర్పాటు చేసుకోవడం జరిగింది. ఈ సభలో ముఖ్య వక్తలు గా టి. పి. టి. ఎఫ్ పూర్వ రాష్ట్ర కార్యదర్శి మైసా. శ్రీనివాస్, సిపిఐ ఎం ఎల్ న్యూడేమోక్రసి రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఆవునూరి. మధు, కే. గోవర్ధన్, బండారి. ఐల్లయ్య, జనార్దన్, తదితరులు పాల్గొని ప్రసంగిస్తారని వారు అన్నారు. ఈ ఐక్యత సభ కు యువత అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

## మద్యం దోపిడిపై ఎమ్మెల్యేకు వినతిపత్రం



**సి కే న్యూస్ ఇల్లందు నియోజకవర్గ ప్రతినిధి,జనవరి 21,**ఇల్లందు పట్టణంలో మద్యం వ్యాపారులు చేస్తున్న అక్రమ, ఆర్థిక దోపిడిని అరికట్టాలని కోరుతూ మంగళవారం ఎమ్మెల్యే కోరం కనకయ్య కు కాంగ్రెస్ పార్టీ నాయకుడు పడిదల నవీన్ ఆధ్వర్యంలో క్యాంప్ ఆఫీస్ నందు వినతిపత్రం అందించారు. ప్రజలకు అవసరమైన మద్యం బ్రాండ్లను వైన్ షాపులో ఉంచకుండా బెల్ట్ షాపులకు అక్రమంగా తరలిస్తున్నారు. బెల్ట్ షాపుల్లో ఎంఆర్పిపై 30 నుండి 40 రూపాయల అధిక ధరలకు అమ్ముతూ ప్రజల జేబులు గుల్ల చేస్తున్నారన్నారు. వైన్ షాపుల్లో అధిక కమిషన్ వచ్చే, ఎప్పుడు వినని, కనని కొత్త బ్రాండ్లను ప్రజలకు అంటగడుతున్నారన్నారు. నాణ్యతలేని ఈ బ్రాండ్ల వలన ప్రజలు అనారోగ్యానికి గురవుతూ తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రజలకు అవసరమైన బ్రాండ్లను వైన్ షాపుల్లో అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

## వాహనదారులకు హెల్మెట్ తప్పనిసరి



**కురుపాం / పార్వతీపురం, సికె న్యూస్ ప్రతినిధి** వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని జిల్లా రవాణా శాఖాధికారి టి.దుర్గా ప్రసాద్ రెడ్డి అన్నారు. రహదారి భద్రతా మాసోత్సవాలు 2025లో భాగంగా జిల్లాలో జరుగుతున్న ద్విచక్ర వాహన రోడ్డు ప్రమాదాల నివారణపై అవగాహనా కార్యక్రమాన్ని మంగళవారం స్థానిక ప్రజా రవాణా శాఖ కార్యాలయంలో వేదాంత జూనియర్ కళాశాల కళాశాల ప్రిన్సిపాల్ యస్.యల్. నాయుడు, నెహ్రూ యువ కేంద్ర వాలంటీర్ల అధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా రవాణా శాఖ అధికారి మాట్లాడుతూ ద్విచక్రవాహనదారులు, వాహనం వెనక కూర్చున్న వారు ఖచ్చితంగా హెల్మెట్ ధరించాలని సూచించారు. లేని పక్షంలో జరిమానాతో పాటు మూడు నెలలు డ్రైవింగ్ లైసెన్స్ క్యాన్సిల్ చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. ట్రాఫిక్ సిగ్నల్స్ విధివిధానాలు, హెల్మెట్ ధరించకపోతే కలిగే నష్టాలపై అవగాహనా కల్పించారు.

జిల్లా ప్రజా రవాణాధికారి యం.శశి కుమార్ మాట్లాడుతూ మైనార్టీ తీరకుండానే తల్లిదండ్రులు తమ పిల్లలకు వాహనాలు ఇస్తున్నారని, వారు కనీసం హెల్మెట్ పెట్టుకోకుండా బండి స్పీడ్ గా నడపటం వల్ల రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని అన్నారు. డ్రైవింగ్ లైసెన్స్ లేని పిల్లలకు ద్విచక్ర వాహనాలు ఇవ్వడం చట్టరీత్యా నేరమని తెలిపారు. ద్విచక్ర వాహనంపై ఇద్దరుకు మించి ప్రయాణించకూడదని అన్నారు. మద్యం సేవించి వాహనములు నడపడం, సెల్ ఫోన్ డ్రైవింగ్ వలన జరిగే నష్టాలను తెలియజేశారు. వాహనాలపై ప్రయాణించేటప్పుడు ట్రాఫిక్ రూల్స్ ను ప్రతీ ఒక్కరు తప్పనిసరిగా పాటించాలని, నిబంధనలకు విరుద్ధంగా ప్రవర్తిస్తే భారీగా అపరాద రుసుము చెల్లించాల్సి ఉంటుందని వివరించారు. పరిమితికి మించి అధిక ప్రయాణికులతో వాహనము నడపరాదని, స్కూల్ పిల్లలు తీసుకు వెళ్ళే బస్సులు,ఆటో డ్రైవర్స్ అధికంగా పిల్లలను వాహనంలో ఎక్కించరాదని తెలిపారు.

ఈ సందర్భంగా కళాశాల విద్యార్థులకు రహదారి భద్రతకు సంబంధించి క్విజ్ పోటీ ని నిర్వహించి విజేతలకు బహుమతులు యివ్వడం జరిగింది. అనంతరం విద్యార్థులతో రోడ్ సేఫ్టీ ర్యాలీ ని నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో సహాయ ప్రజా రవాణాదికారి జి.సత్యనారాయణ,యన్. రమేష్ కుమార్,ఏ.వర ప్రసాద్, బి. కాశీరామ్ నాయక్, రవాణా శాఖ సిబ్బంది, వేదాంత వేదాంత జూనియర్ కళాశాల విద్యార్థులు సుమారు 110 మంది పాల్గొన్నారు.

# జవహర్ నగర్ కమిషనర్ డి డాకు నాయక్ ఆధ్వర్యంలో ప్రజాపాలన కార్యక్రమం

**ముఖ్య అతిథులుగా పాల్గొన్న మేయర్ శాంతి కోటేష్ గౌడ్ మరియు డిప్యూటీ మేయర్ రెడ్డి శెట్టి శ్రీనివాస్**





**సీకే న్యూస్ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా స్టాఫ్ రిపోర్టర్ రంజిత్**

మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్నటువంటి రాష్ట్ర ప్రభుత్వం ఆరు గ్యారంటీలు దిశగా నిర్వహిస్తున్న ప్రజా పాలన సభలో సంక్షేమ పథకాలను నూతన రేషన్ కార్డులు మరియు రైతు భరోసా మరియు ఇందిరమ్మ ఇండ్లు లబ్ధిదారులు అందించడం కొరకై నిర్వహించిన సభలో భాగంగా పలు వార్డులలో నిర్వహించారు అందులో భాగంగా ఈరోజు జవహర్ నగర్ మున్సిపల్ పరిధిలో ని 1,2,3,4,5,6,7,8 లో జరుగుతున్న వార్డు సభలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ కార్పొరేటర్లు రాజ్ కుమార్, బల్లి రోజా శ్రీనివాస్, వార్డు ఆఫీసర్లు, మున్సిపల్ సిబ్బంది మరియు పోలీస్ సిబ్బంది అధికారులు, పాల్గొన్నారు ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ జవహర్ నగర్ అధ్యక్షులు మల్లెపూల శ్రీకాంత్ యాదవ్ మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం ప్రజాపాలన కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకుందని ప్రతి ఒక్కరూ ఈ సభలో భాగం కావాలని ప్రజలందరూ అధికారులకు సహాయ సహకారాలు అందించాలని తెలియజేశారు ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు యువజన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు,
ఇంద్రమ్మ కమిటీ సభ్యులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు

# పీర్ల జతిన్ శ్రీకృష్ణ పుట్టినరోజున వివిధ పాఠశాల విద్యార్థుల ముఖంలో చిరునవ్వు..

**“జిల్లావ్యాప్తంగా గిరిజన సంఘాల నుంచి పుట్టినరోజు శుభాకాంక్షలు అందుకున్న శ్రీకృష్ణ”**



**“ములుగు జిల్లా సీకే న్యూస్ ప్రతినిధి భార్గవ్”**ములుగు జిల్లా వెంకటాపురం మండల కేంద్రంలోని గల పీర్ల కృష్ణ బాబు కుమారుడైన.. పీర్ల జతిన్ శ్రీకృష్ణ పుట్టినరోజు సందర్భంగా ఎంపీపీ ఎస్ నాయకులగూడెం పాఠశాలలో 50 మంది విద్యార్థులకు నోటు బుక్కులు పెన్నులు పెన్సిల్స్ ఎరేజర్స్ ఇవ్వడం జరిగింది మరియు ఎంపీపీ ఎస్ సుడిబాక పాఠశాలలో 26 మంది విద్యార్థులకు భోజనపు ప్లేట్లు గ్లాసులు పంచడం జరిగింది ఈ సందర్భంగా నాయకులగూడెం ప్రధానోపాధ్యాయులు పి సూర్యనారాయణ మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతంలో ఆర్థికంగా వెనుకబడ్డ విద్యార్థుల విద్యాభివృద్ధికి సంబంధించిన మెటీరియల్ ఇవ్వడం చాలా సంతోషకరమని అన్నారు ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు సహోపాధ్యాయులు సిబ్బంది మరియు విద్యార్థులు “జతిన్ శ్రీ కృష్ణ” కి బర్త్డే విషెస్ ఘనంగా తెలియజేశారు మరియు ఎంపీపీ ఎస్ సుడిబాక పాఠశాల యందు 26 మంది విద్యార్థులకు భోజన ప్లేట్లు గ్లాసులు అందించినందుకు పాఠశాల ప్రధానోపాధ్యాయులు జతిన్ శ్రీకృష్ణ కి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు ఈ కార్యక్రమంలో నాయకులగూడెం ప్రధానోపాధ్యాయులు పి సూర్యనారాయణ మరియు పి స్వరూప రాణి సుడిబాక పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి కృష్ణ బాబు పి సంధ్యారాణి ఇర్ప ప్రభాకర్ అంగన్వాడి టీచర్ సుమతి తదితరులు పాల్గొనడం జరిగింది...

## ఇది రాష్ట్రంలోనే మొదటిసారి.

- ఫోటోగ్రాఫర్ భార్యకు కుటుంబ భరోసా పథకం ద్వారా ఆర్థిక సహాయం.



**సీకే న్యూస్ ఇల్లందు మండల ప్రతినిధి ( సురేష్ ) జనవరి 21 :-**ఫోటో అండ్ వీడియోగ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్, ఇల్లందు-గుండాల-ఆళ్ళపల్లి తెలంగాణ రాష్ట్ర అసోసియేషన్ ప్రవేశపెట్టిన కుటుంబ భరోసా పథకంలో భాగంగా ఫోటోగ్రాఫర్ కె కాకుండా ఫోటోగ్రాఫర్ భార్యకు కూడా కుటుంబ భరోసా పథకం ఉండాలనే ఉద్దేశంతో ప్రవేశపెట్టినందున, ఇటీవలే ఇల్లందు మండలంలోని అసోసియేషన్ సభ్యులు సూరజ్ కుమార్ పాసీ గారి భార్య “చందా పాసీ” గారు మరణించినందున వారు ఈ పథకంలో జాయిన్ అయ్యి రెగ్యులర్ గా ఉన్నందున వారికి రాష్ట్ర అధ్యక్షులు అధ్యక్షులు, జిల్లా అధ్యక్షులు, మండల అధ్యక్షులు, మిగతా సభ్యులు అందరూ కలిసి 160,000 రూపాయలు చందా పాసీ గారికి వచ్చిన కుటుంబ భరోసా చెక్ ను వారి నామినీగా ఉన్నటువంటి తన భర్త శ్రీ సూరజ్ కుమార్ పాసీ గారికి ఇవ్వడం జరిగినది.

# పారదర్శకంగా అర్హులకు ప్రభుత్వ కార్యక్రమాల లబ్ది చేకూర్చాలి...





- రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, ఆర్థిక, ఇంధన శాఖల మంత్రివర్యులు భట్టి విక్రమార్క మల్లు
- పథకాలకు అర్హుల ఎంపిక నిరంతర ప్రక్రియ ప్రజలు ఆందోళన చెందవద్దు
- దరఖాస్తులు సమర్పణ కు చివరి తేదీ ఏమీ లేదు, అపోహలు, తప్పుడు వార్తలు నమ్మవద్దు
- గ్రామ సభలలో పెట్టే ప్రాథమిక జాబితా మంజూరు పత్రం కాదు, కేవలం దరఖాస్తుల స్వీకరణ జాబితా మాత్రమే
- గ్రామ సభల నిర్వహణ పై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష చేసిన డిప్యూటీ సి.ఎం., మంత్రులు, సి.ఎస్

**సికె న్యూస్ ప్రతినిధి ఖమ్మం, జనవరి 21:**పారదర్శకంగా అర్హులకు ప్రభుత్వ కార్యక్రమాల లబ్ది చేకూర్చాలని, పథకాలకు లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ నిరంతరంగా కొనసాగుతుందని, ప్రజలు అనవసరంగా ఆందోళన చెందవద్దని రాష్ట్ర ఉప ముఖ్య మంత్రి, ఆర్థిక, ఇంధన శాఖల మంత్రివర్యులు భట్టి విక్రమార్క మల్లు అన్నారు.

మంగళవారం రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, ఆర్థిక, ఇంధన శాఖల మంత్రివర్యులు భట్టి విక్రమార్క మల్లు రాష్ట్ర మంత్రులు ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాస రెడ్డి, తుమ్మల నాగేశ్వర రావు, జూపల్లి కృష్ణారావు, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి లతో కలిసి గ్రామ సభల నిర్వహణ పై జిల్లా కలెక్టర్ లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు.

ఈ సందర్భంగా డిప్యూటీ సి.ఎం. భట్టి విక్రమార్క మల్లు మాట్లాడుతూ, 4 నూతన పథకాల అమలు కోసం నేడు గ్రామ సభలు ప్రారంభించి రాష్ట్రంలో మొదటి రోజు 4938 గ్రామ/ వార్డు సభలు నిర్వహించడం జరిగిందని అన్నారు. గ్రామ సభలలో ప్రదర్శించిన పథకాల అర్హుల ప్రాథమిక జాబితాలో అభ్యంతరాలు ఉంటే రాతపూర్వకంగా స్వీకరించి విచారణ చేపట్టాలని, అనర్హులుగా తేలితే జాబితా నుంచి తొలగించాలని ఉప ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు.

గ్రామ సభలలో పెట్టే ప్రాథమిక జాబితా మంజూరు పత్రం కాదని, కేవలం దరఖాస్తుల స్వీకరణ జాబితా మాత్రమేనని ప్రజలకు తెలియజేయాలని, అర్హులు ఎవరైనా ఉంటే దరఖాస్తులు తీసుకుంటామని విచారించి అర్హులకు తప్పనిసరిగా పథకాలు అందిస్తామని ప్రజలకు స్పష్టంగా అధికారులు తెలుపాలని ఉప ముఖ్యమంత్రి అన్నారు.

ప్రభుత్వం అమలు చేసే ప్రజా సంక్షేమ కార్యక్రమాల లబ్ధి పొందాలంటే ప్రజలు ఎప్పుడైనా మండలాలు , మున్సిపాలిటీలలో ఏర్పాటు చేసిన ప్రజా పాలన కేంద్రాలలో దరఖాస్తులు సమర్పించ వచ్చని అన్నారు. ప్రజాపాలన కేంద్రాలకు వచ్చే దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ అర్హులను ఎంపిక చేసి పథకాలను వర్తింప చేయడం జరుగుతుందని అన్నారు.

రాష్ట్ర నీటి పారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ, మన రాష్ట్రంలో 91 లక్షల తెల్ల రేషన్ కార్డులు 2 కోట్ల 80 లక్షల లబ్ధిదారులతో ఉన్నాయని, గత 10 సంవత్సరాలలో నూతన రేషన్ కార్డులు జారీ చేయని కారణంగా ప్రస్తుతం ప్రజల నుంచి అధికంగా డిమాండ్ ఉందని అన్నారు.

ప్రజా పాలన, మీసేవ కేంద్రాలలో రేషన్ కార్డు కోసం వచ్చిన దరఖాస్తుల పరిశీలించి అర్హులను ఎంపిక చేయాలని, ప్రభుత్వం అమలు చేసే ప్రతి సంక్షేమ కార్యక్రమానికి రేషన్ కార్డు లింక్ ఉండటంతో అర్హులందరికీ రేషన్ కార్డు జారి అయ్యేలా చూడాలని, రేషన్ కార్డుల జారీ నిరంతర ప్రక్రియగా కొనసాగుతుందని ప్రజలకు విశ్వాసం కల్పించాలని, నూతన దరఖాస్తులను స్వీకరించాలని, మన దగ్గరకు వచ్చిన ప్రతి దరఖాస్తును విచారించి అర్హత ఉంటే రేషన్ కార్డు జారీ చేయాలని మంత్రి తెలిపారు.

రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ, ఇందిరమ్మ ఇండ్ల సర్వే అనంతరం ఇండ్లు లేని దాదాపు 30 లక్షలమంది అర్హులను గుర్తించి వివరాలు జిల్లాలకు పంపామని, వీరిలో ఇంటి స్థలం ఉన్నవారిలో ప్రాధాన్యత క్రమం లో నిరుపేదలను మొదటి విడత కింద తీసుకొని ఇండ్లు మంజూరు చేయడం జరుగుతుందని అన్నారు.

వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ, ఖమ్మం జిల్లాలో మొదటి రోజు 208 గ్రామ పంచాయతీలలో, 42 మున్సిపల్ వార్డులలో మొత్తం 250 సభలు ప్రశాంతంగా జరిగాయని, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్ల కోసం ప్రజలు అధికంగా దరఖాస్తులు అందించారని, ప్రతి దరఖాస్తులు పరిశీలిస్తూ విచారించి అర్హులైన ఎంపిక చేసి ప్రభుత్వ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటామని అన్నారు.



# బ్లాక్ అండ్ వైట్ ఫోటోలోనూ మతిపోగొట్టేసిన శ్వేత అందాలు..!

మంచి హిట్ కోసం ఎప్పటి నుంచో ఎదురు చూస్తున్న నటి నందితా శ్వేత. ఉదయ మ్యూజిక్ ఛానల్లో వీజేగా తన కెరీర్ను ప్రారంభించిన నందితా శ్వేత.. 2008లో కన్నడ చిత్రం 'నంద లవ్స్ నందిత' చిత్రంతో కథానాయిక అయ్యారు. ఆ తర్వాత టాలీవుడ్ లోకి అడుగుపెట్టారు. మొదటి సినిమా ఎక్కడికి పోతావు చిన్నవాడలో నిఖిల్ సరసన నటించి అదరగొట్టింది. ఈ మూవీ బాగానే క్లిక్ అయినప్పటికీ నందిత నటనకు మంచి మార్కులు పడినప్పటికీ ఆమె మళ్లీ చెప్పుకోదగిన ఛాన్సులు రాలేదు. మధ్యలో అర కొర అవకాశాలు వచ్చినా అవి పెద్దగా ఆకట్టుకోలేదు. అయినా ఆమె ఏ మాత్రం వెనక్కి అడుగువేయకుండా తనను తాను నిరూపించుకునే ప్రయత్నం చేస్తూనే ఉంది. ప్రస్తుతం మూవీ పైనే నందిత ఆశలన్నీ మూవీకి ముందు నందిత బుల్లి తెరపై కూడా సందడి చేశారు. ఓ పాపులర్ ఛానెల్ లో డ్యాన్స్ షోకి కొంత కాలం జడ్జిగా వ్యవహరించారు. ఇదిలా ఉండగా నందిత సోషల్ మీడియాలోనూ చురుకుగా ఉంటారు. ఆమెకు కేవలం ఇన్ స్టాగ్రామ్ లో 1.1 మిలియన్ ఫాలోవర్స్ ఉన్నారు. ఆమె తరచూ తన ఫోటోలను షేర్ చేస్తూ అభిమానులకు ట్రీట్ ఇస్తూ ఉంటారు. తాజాగా బ్లాక్ అండ్ వైట్ లో ఫోటోలకు ఫోజులు ఇచ్చారు. ఫోటో బ్లాక్ అండ్ వైట్ ఫోటో అయినా ఆమె అందాలు మరింతగా హైలెట్ అయ్యాయి. గతంలోనే ఇంతకంటే గ్లామరస్ లుక్స్ లో కనిపించిన అమ్మడు ఇప్పుడు మరింత అందంగా ఉందని అంగున్నారు.. చీరకట్టులో చాలా అందంగా కనిపిస్తున్నారు అని ఫాలోవర్స్ పాజిటివ్ గా రియాక్ట్ అవుతున్నారు. గోడ మీద వాలి ఏదో ఆలోచిస్తున్నట్లుగా ఆ ఫోటో ఉండటం విశేషం. ఈ ఫోటోలు ఇప్పుడు అభిమానులను ఆకట్టుకుంటున్నాయి.



## నుష్రత్ భరుచ్చా యొక్క సిజ్లింగ్ క్లిక్‌లు



## రష్మీ గౌతమ్ అద్భుతమైన లుక్స్



## మెగా ఫ్యాన్స్ ఆశలన్నీ ఆ సినిమాపైనే..!

మెగా ఫ్యామిలీకి లాస్ట్ ఇయర్ బాగా కలిసొచ్చిందని అభిమానులు సంబరాలు చేసుకున్నారు. చిరంజీవిని 'పద్మవిభూషణ్' వరించడం, గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డ్స్ లో ఎక్కడం, ఆంధ్రప్రదేశ్ ఎన్నికల్లో జనసేన పార్టీ విజయం సాధించి పవన్ కల్యాణ్ డిప్యూటీ సీఎంగా బాధ్యతలు చేపట్టడం, చెన్నై వేల్స్ యూనివర్శిటీ నుంచి రామ్ చరణ్ గౌరవ డాక్టరేట్ పొందడం, నాగబాబుకు ఏపీ మంత్రి వర్గంలో చోటు ఖరారవ్వడం.. ఇవన్నీ మెగా ఫ్యాన్స్ ను ఉత్సాహ పరిచాయి. కానీ సినిమాల పరంగా మాత్రం వారు చాలా నిరుత్సాహానికి గురవుతున్నారు.మెగా హీరోలు గత కొన్నాళ్లుగా బాక్సాఫీస్ దగ్గర సరైన విజయాలు అందుకోలేకపోతున్నారు. 'భోళా శంకర్'తో చిరంజీవి భారీ డిజాస్టర్ చవి చూశారు. మెగా మేనమామ-మేనల్లుడు పవన్ కల్యాణ్, సాయి ధరమ్ తేజ్ తొలిసారిగా కలిసి నటించిన 'బ్రో' సినిమా ఆశించిన సక్సెస్ సాధించలేదు. వరుణ్ తేజ్ సోలోగా హిట్టు కొట్టి చాలా ఏళ్లైంది. 'గని', 'గాండీవధారి అర్జున', 'ఆపరేషన్ వాలెంటైన్', 'మట్కా' సినిమాలు దారుణంగా ఫెయిల్ అయ్యాయి. 'ఉప్పెన' తర్వాత వైష్ణవ్ నటించిన ఒక్క సినిమా కూడా హిట్టవ్వలేదు. చివరగా వచ్చిన 'ఆదికేశవ' డిజాస్టర్ అయింది.ఇక రామ్ చరణ్ సోలోగా సక్సెస్ సాధించి ఏళ్లు గడిచిపోయింది. తన తండ్రితో ఫస్ట్ టైం పూర్తి స్థాయిలో స్క్రీన్ షేర్ చేసుకున్న 'ఆచార్య' మూవీ డిజార్డర్ గా మారింది. %===% స్టార్ డమ్ కూడా ఈ చిత్రాన్ని కాపాడలేకపోయింది. ఇలాంటి పరిస్థితుల్లో 'గేమ్ ఛేంజర్' సినిమాతో చెర్రీ సోలోగా బ్లాక్ బస్టర్ హిట్టు కొట్టి చూపించాలని మెగా అభిమానులు బలంగా కోరుకున్నారు. కానీ సంక్రాంతికి రిలీజైన ఈ చిత్రం కూడా తీవ్ర నిరాశ పరిచింది. దీంతో నెట్టింట యాంటీ ఫ్యాన్స్ నుంచి విపరీతమైన ట్రోలింగ్ ఎదుర్కోవాల్సి వచ్చింది. 'గేమ్ ఛేంజర్' చిత్రానికి మిక్స్డ్ టాక్ వచ్చినప్పటికీ, ఓపెనింగ్ డే భారీ వసూళ్లను రాబట్టినట్లుగా గొప్పగా చెప్పుకున్నారు. రెండో రోజు నుంచి మేకర్స్ కూడా సైలెంట్ అయిపోయారు. ఫస్ట్ వీకెండ్ వరకూ సోషల్ మీడియాలో డిపెండ్ చేసుకుంటూ వచ్చిన ఫ్యాన్స్ సైతం.. ఆ తర్వాత మెల్లిమెల్లిగా రిజల్ట్ ను యాక్సెప్ట్ చేయడం మొదలుపెట్టారు. కానీ ఎన్నో హోప్స్ పెట్టుకున్న సినిమా డిజాస్టర్ అయిందనే



విషయాన్ని వారు జీర్ణించుకోలేకపోతున్నారు. ఈ నేపథ్యంలో త్వరలో రాబోయే 'విశ్వంభర' మూవీ ఈ గాయాన్ని మర్చిపోయేలా చేస్తుందని భావిస్తున్నారు.మెగాస్టార్ చిరంజీవి హీరోగా వశిష్ఠ దర్శకత్వంలో తెరకెక్కుతున్న సోషియో ఫాంటసీ యాక్షన్ అడ్వెంచర్ మూవీ "విశ్వంభర". సంక్రాంతికి ఈ సినిమానే విడుదల అవ్వాల్సింది. కానీ రామ్ చరణ్ మూవీ కోసం వాయిదా వేసుకున్నారు. సమ్మర్ స్పెషల్ గా రిలీజ్ చెయ్యాలని మేకర్స్ ప్లాన్ చేసుకున్నారు. ఈ సినిమా మంచి సక్సెస్ సాధిస్తే, మళ్ళీ సెలబ్రేషన్స్ మోడ్ లోకి వచ్చేయొచ్చని ఫ్యాన్స్ అంతా ఎదురు చూస్తున్నారు. రిలీజ్ డేట్ ఫిక్స్ చేసిన తర్వాత ఈ సినిమాకి సోషల్ మీడియాలో డ్యూటీ చెయ్యాలని నిర్ణయించుకున్నారు. నిజానికి మెగా ఫ్యాన్స్ కోసం 'విశ్వంభర'తో పాటుగా 'హరి హర వీరమల్లు' సినిమా కూడా రాబోతోంది. మార్చి 28న ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తామని నిర్మాతలు ప్రకటించారు కూడా. కానీ పవన్ కల్యాణ్ షూటింగ్ ఇంకా పెండింగ్ ఉండటం, ఈ గ్యాప్ లో ఆ డేట్ మీద మరికొన్ని ఇతర సినిమాలు కర్చీఫ్స్ వేస్తుండటంతో.. వీరమల్లు రాకపై అందరిలో సందేహాలు మొదలయ్యాయి. అందుకే చిరంజీవి చిత్రం మీదనే ఇప్పుడు అభిమానులు ఆశలు పెట్టుకున్నారు. మరి ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద ఎలాంటి సక్సస్ సాధిస్తుందో వేచి చూడాలి. ఇకపోతే పవన్ కల్యాణ్ ప్రస్తుతం నటిస్తున్న వీరమల్లు, %ూ+%.. సాయి దుర్గ తేజ్ '%ః+% - సంబరాల ఏటిగట్టు' సినిమాలు ఈ ఏడాదే విడుదల కాబోతున్నాయి. మరోవైపు రామ్ చరణ్ ఇప్పుడు బుచ్చిబాబు సినిమా షూటింగుతో బిజీగా ఉన్నారు. మేర్లపాక గాంధీతో వరుణ్ తేజ్ ఒక హార్రర్ కామెడీ సెట్స్ మీదకి తీసుకెళ్లడానికి రెడీ అవుతున్నారు. ఇవి కాకుండా మెగా హీరోలు కొన్ని క్రేజీ ప్రాజెక్ట్స్ లైన్ లో పెట్టారు. వారిలో చిరంజీవి బ్యాక్ టూ బ్యాక్ అనౌన్స్ మెంట్స్ తో రాబోతున్నారు.